# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి :13 సంచిక :01 ఆదివారం 6-9-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/





## పాక్ చిత్తు చిత్తు!

7 వికెట్ల తేడాతో టీమిండియా హ్యాట్రిక్ విక్టరీ

- 55 పరుగులకే చాపచుట్టేసిన దాయాది
- 8.4 ఓవర్లలోనే ఛేదించిన భారత్
- ఓటమితో మూసుకుపోయిన పాక్ సెమీస్ దారులు
- అత్యధిక మ్యాచ్‌లాడిన కెప్టెన్‌గా కౌర్ రికార్డు
- మహిళల టీ20 ఆసియా కప్ టోర్నీ

02

దుబాయ్ వేదికగా పాకిస్తాన్‌పై టీమిండియా దుమ్మురేపింది. మహిళల టీ20 ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థిని కేవలం 55 పరుగులకే కుప్పకూల్చిన భారత్.. 8.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 7 వికెట్ల ఘన విజయం సాధించింది. దీంతో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసి హ్యాట్రిక్ కొట్టింది. భారత బౌలర్ల ధాటికి పాక్ బ్యాటర్లు నిలవలేకపోగా.. హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ రాణించడంతో టీమిండియా అలవోకగా గెలుపొందింది. మరోవైపు కెప్టెన్‌గా 150వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడిన హర్మన్‌ప్రీత్ అరుదైన రికార్డు సొంతం చేసుకుంది.




## పిల్లల కన్నా వృద్ధుల జనాభా ఎక్కువ!

- మానవ చరిత్రలో ఇదే తొలిసారి
- 2025లో తొలిసారి వృద్ధుల జనాభా అధికం
- ఐదేళ్లలోపు పిల్లల సంఖ్యను దాటిన వృద్ధులు
- తగ్గుతున్న జననాల రేటుతో మారుతున్న జనాభా
- పెరుగుతున్న ఆయుర్దాయంతో వృద్ధుల సంఖ్య పెరుగుదల
- 2025లో 65 ఏళ్లు పైబడిన వారు 85.20 కోట్లు
- 2060 నాటికి 200 కోట్లకు చేరనున్న వృద్ధులు
- ప్రపంచ జనాభాలో 55 శాతం పెరుగుదల వృద్ధుల్లోనే
- 2060 నాటికి ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులే

# ఢీ అంటే ఢీ

వ్యూహ, ప్రతి వ్యూహాల్లో అధికార, విపక్షాలు

- సర్కారుపై దాడికి ప్రతిపక్షాలు సమాయత్తం
- హామీల అమలుపై ప్రశ్నించేలా కార్యాచరణ
- సమర్థంగా తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ సిద్ధం
- వెయ్యి రోజుల ప్రగతిని వివరించేందుకు ప్లాన్
- 22ఏ భూముల నిషేధంతో ప్రజల్లో గందరగోళం

**రేపటినుంచి అసెంబ్లీ సమావేశాలు**

హైదరాబాద్

అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై అధికార, విపక్ష పార్టీలు దృష్టిసారించాయి. ఆరు గ్యారంటీలు, ఇచ్చిన హామీలుపై నిలదీసేందుకు ప్రతిపక్షాలు సమాయత్తం అవుతున్నాయి. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాయి. ప్రతిపక్షాల ప్రశ్నలను, దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ రెడీ అవుతున్నది. వెయ్యి రోజుల ప్రజా పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు అధికార కాంగ్రెస్ సిద్ధమవుతున్నది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేందుకు విపక్షాలు, ప్రజలకు అందిస్తున్న ప్రగతి ఫలాల గురించి చెప్పేందుకు కాంగ్రెస్ వ్యూహ, ప్రతివ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. అటు అధికార పార్టీ, ఇటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐలు అసెంబ్లీలో

-మిగతా 2లో



## మూడు తరాల్ని ముంచేశారు

- దగ్గర్లోనే కాంగ్రెస్‌ను నిషేధిత జాబితాలో పెట్టే రోజులు
- పాలిటెక్నిక్ భూములపై ప్రభుత్వం కన్ను..
- జీవో 97ను అసెంబ్లీలో ఎండగడతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / రాజన్నసిరిసిల్ల / వేములవాడ

కాంగ్రెస్ పార్టీనే నిషేధిత జాబితాలో పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.. ఒక్క మంత్రినే బర్తరఫ్ చేయడం కాదు.. ఆ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులొచ్చాయి' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

-మిగతా 2లో




## 4 రాష్ట్రాల్లో ముందుగానే జనగణన.

- గోవా, యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్‌కు వర్తింపు
- డిసెంబర్ 1 నుంచి జనవరి 4 వరకు గణన
- జనవరి 5 నుంచి 9 వరకు సమీక్ష దశ
- జనగణన చట్టం ప్రకారమే నిర్ణయం
- షెడ్యూల్‌ను ధ్రువీకరించిన రిజిస్ట్రార్ జనరల్
- కేంద్రం నిర్ణయంపై జైరామ్ రమేశ్ ప్రశ్నలు
- ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యపై కాంగ్రెస్ విమర్శ

## తరగతి గదికి పరిమితం కావద్దు




- డ్రగ్స్, స్క్రీన్ టైమ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి
- విద్యార్థుల జీవితాల్లో టీచర్లు భాగమవ్వాలి
- చదువుతోపాటు పిల్లల ఆసక్తులు, అలవాట్లు గుర్తించాలి
- మాదకద్రవ్యాల ముప్పుపై అవగాహన కల్పించాలి
- క్రీడలతో మొబైల్ స్క్రీనింగ్‌కు చెక్ పెట్టవచ్చు
- బోధనలో సృజనాత్మక పద్ధతులను ప్రవేశపెట్టాలి
- జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రధాని మోడీ ఉద్బోధ




## 22ఏతో ప్రజల ఆస్తుల దోపిడీ..

- కాంగ్రెస్ సర్కార్‌పై కిషన్‌రెడ్డి ఫైర్
- 22ఏతో ప్రజల ఆస్తులను దోపిడీ చేస్తున్నారని ఆరోపణ
- భూములు అమ్మితేనే ప్రభుత్వం నడిచే పరిస్థితి
- ప్రజాపాలన కాదు.. ప్రజా పీడన అంటూ విమర్శ
- కాంగ్రెస్ అధిష్ఠానానికి రాష్ట్రం నుంచి డబ్బులు
- తెలంగాణను రియల్ ఎస్టేట్ కంపెనీగా మార్చారన్న కిషన్‌రెడ్డి
- 22ఏ జాబితా నుంచి భూముల తొలగింపునకు 30 శాతం కమీషన్
- నిషేధిత జాబితా దందాపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- మానవ హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందన్న బీజేపీ నేతలు

హైదరాబాద్,

కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏతో ప్రజల ఆస్తులను నిలువునా దోపిడీ చేస్తున్నదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూములు అమ్మకపోతే ప్రభుత్వం నడిచే పరిస్థితి లేదని, ప్రజాపాలన అని చెప్పి, కాంగ్రెస్ సర్కార్ ప్రజా పీడన చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి కోట్ల రూపాయలు కాంగ్రెస్ అధిష్ఠానానికి పంపుతున్నారని ఆరోపించారు.

-మిగతా 2లో




## బీఎల్ఏ దాడిలో 25 మంది పాక్ సైనికులు మృతి

- పాక్ సైన్యంపై బీఎల్ఏ వరుస దాడులు
- వేర్వేరు ఘటనల్లో 25 మంది సైనికులు మృతి
- జియారత్ క్రాస్ వద్ద కాన్వాయ్‌పై దాడి
- ౦ండు వాహనాలపై దాడిలో 18 మంది మృతి
- సూరబ్‌లో మరో దాడిలో ఏడుగురు సైనికులు మృతి
- దాడులకు బాధ్యత వహించిన ఫతేహ్, ఎస్‌టీఓఎస్ గ్రూపులు
- ఘటనలపై పాక్ ప్రభుత్వం స్పందించలేదు
- బెలూచిస్తాన్‌లో మరోసారి ఉద్రిక్తత

# బీఆర్ఎస్ కోటలపై దండయాత్ర

సిరిసిల్ల, సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా పాతుతాం

- కేసీఆర్ సభకు రా..లేదా గౌరవంగా రాజీనామా చేయి
- నేను ఉన్నంతకాలం బీఆర్ఎస్‌ను ఎదగనివ్వను
- రైతులు, మహిళలు, యువత సంక్షేమమే లక్ష్యం
- వెయ్యి రోజుల పాలనలో రూ.1.70 లక్షల కోట్ల రైతు ప్రయోజనాలు
- 2029లో కాంగ్రెస్‌కు 90 సీట్లు ఖాయమన్న సీఎం
- వెయ్యి రోజుల ప్రగతి పాలన సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- నకిరేకల్ లో భారీ బహిరంగ సభ

నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

'ప్రతిపక్షనేత కే చంద్రశేఖరరావు (కేసీఆర్) శాసనసభకు రా... లేకుంటే గౌరవంగా పదవికి రాజీనామా చేయి...గజ్వేల్‌లో తేల్చుకుందాం' అని సీఎం ఏ రేవంత్‌రెడ్డి సవాలు విసిరారు. "మీరు రాయి విసిరితే.. మేము ఆ రాయితోనే సమాధానం చెబుతాం... మీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కలిసి అసెంబ్లీకి రావాలి. అక్కడే చూసుకుందాం. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, విద్య, సంక్షేమం సహా అన్ని అంశాలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు సిద్ధం"

-మిగతా 2లో



# తరగతి గదికి పరిమితం కావద్దు

**-డ్రగ్స్, స్క్రీన్ టైమ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి**
**-విద్యార్థుల జీవితాల్లో టీచర్లు భాగమవ్వాలి**
**-చదువుతోపాటు పిల్లల ఆసక్తులు, అలవాట్లు గుర్తించాలి**
**-మాదకద్రవ్యాల ముప్పుపై అవగాహన కల్పించాలి**
**-క్రీడలతో మొబైల్ స్క్రీనింగ్‌కు చెక్ పెట్టవచ్చు**
**-బోధనలో సృజనాత్మక పద్ధతులను ప్రవేశపెట్టాలి**
**-జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రధాని మోడీ ఉద్బోధ**



న్యూఢిల్లీ:
డ్రగ్స్ దుష్పరిణామాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించండి, స్క్రీన్ టైమ్ (మొబైల్ ఫోన్) తగ్గించడంలో వారికి సాయం చేయండి అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం జాతీయ పురస్కారం పొందిన ఉపాధ్యాయులతో సంభాషిస్తూ సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యార్థులను సృజనాత్మక కృషి వైపు ప్రోత్సహించాలని అన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదికే పరిమితం కాకుండా విద్యార్థుల ప్రవర్తన, రోజువారీ జీవితంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు తగ్గుతున్న నేపథ్యంలో పిల్లల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర మరింత ముఖ్యమవుతోందని అన్నారు. డ్రగ్స్ విషయంలో కొన్ని పెద్ద నగరాలు, విశ్వవిద్యాలయాల్లో ఎవరు ఎవరికి ఏమిచ్చారో తెలియకపోవడం వల్ల సమస్య ఎవరిని ప్రభావితం చేస్తోందో గుర్తించడం కష్టమని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులు అవగాహన కోసం చర్యలు తీసుకోవాలి, ఏ పిల్లవాడిలోనైనా ప్రవర్తనలో మార్పు కనిపిస్తే సూక్ష్మంగా గమనించాలి అని సూచించారు. విద్యార్థి బాల్యం చనిపోనివ్వకూడదు, విద్యార్థుల జీవితాల్లో బాల్యాన్ని సజీవంగా ఉంచడంలో ఉపాధ్యాయులే అతిపెద్ద కృషి చేయగలరని అన్నారు. స్క్రీన్ టైమ్ పెద్ద సమస్యగా మారిందని ప్రధానమంత్రి అన్నారు. పిల్లలు మొబైల్ ఫోన్లలో ఎంత సమయం గడుపుతున్నారు, రాత్రి పొద్దుపోయాక కూడా మొబైల్ ఫోన్లు వాడుతున్నారా అని తల్లిదండ్రులను వాకబు చేయాలని ఉపాధ్యాయులను కోరారు. క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలపై ఆసక్తి పెంచడం ద్వారా పిల్లలు క్రమంగా అధిక స్క్రీన్ టైమ్ వినియోగం నుంచి బయటపడవచ్చని సూచించారు.

# ఢీ అంటే ఢీ

మొదటి తరువాయి

ఢీ అంటే ఢీ అన్నట్టుగానే వ్యవహరించే అవకాశమున్నది.
అభివృద్ధిపైనే కాంగ్రెస్ ఫోకస్
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయ్యాయి. ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే వంటగ్యాస్, రైతుభరోసా కింద ఏటా రూ.12 వేలు, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.పది లక్షలకు పెంచి అమలు చేస్తున్నది. ఆసరా పెన్షన్ల పెంపు, మహిళలకు నెలకు రూ.2,500, కౌలు రైతులకు ఏటా రూ.15 వేలు, రైతు కూలీలు, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు, విద్యార్థులకు రూ.ఐదు లక్షల వరకు విద్యా భరోసా కార్డు, ఆటో కార్మికులకు ఏటా రూ.12 వేలు వంటివి ఇంకా అమల్లోకి రాలేదు. నిధుల కొరత ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నది. అప్పులు, వడ్డీ చెల్లింపుల సమస్య కూడా తీవ్రంగా ఉన్నది. అయినా అభివృద్ధిపైనే దృష్టిసారించామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నారు. ఇటీవల ముసారాంబాగ్, చంచల్‌గూడ ఫ్లైఓవర్లను ప్రారంభించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభించారు. నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నూతనంగా నిర్మించిన 100 పడకల ఏరియా ఆస్పత్రిని రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అదే నియోజకవర్గంలో రూ.9.85 కోట్ల వ్యయంతో నిర్మించే తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించే "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్"కు శంకుస్థాపన చేశారు. వీటితోపాటు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవంతోపాటు శంకుస్థాపనలు చేశారు. 32 నెలల్లో రూ.36 వేల కోట్ల రైతు భరోసా వేశామనీ, అసెంబ్లీలో చర్చకు సిద్ధమని సీఎం ప్రకటించారు. రెండేండ్లలో 72 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు.
తెరపైకి కేసీఆర్ రాజీనామా
గజ్వేల్ ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలనే అంశాన్ని రేవంత్‌రెడ్డి తెరపైకి తెచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనుంది. 365 రోజులు ఉద్యోగానికి రాకపోతే ఉద్యోగస్తులను బర్తరఫ్ చేస్తారనీ, రూ.22.24 కోట్లు ప్రభుత్వం నుంచి జీతం తీసుకున్న కేసీఆర్ ఒక్క రోజు కూడా బయటకు రాలేదనీ, డిస్మిస్ చేయాలా వద్దా?అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇంకోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అంశం ఎథిక్స్ కమిటీ పరిశీలనలో ఉన్నది. ఆయన అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా వేటు వేసే అవకాశమున్నట్టు తెలిసింది. ఒకవైపు కేసీఆర్ రాజీనామా, ఇంకోవైపు కౌశిక్‌రెడ్డిపై వేటు వేస్తే బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టొచ్చని అధికార పార్టీ భావిస్తున్నది.

# మూడు తరాల్ని ముంచేశారు

మొదటి తరువాయి

కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చ కపోవడాన్ని నిరసిస్తూ.. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన 'యువ సమరభేరి' సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చి 100 రోజుల్లో అమలు చేస్తామని డైలాగులు కొట్టి వెయ్యి రోజులు దాటినా ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. బకాసురుల్లా మేస్తూ, కుంభకర్ణుల్లా పడుకుంటూ, పందికొక్కుల్లా తింటూ పాలనను గాలికి వదిలేశారన్నా రు. 'ఇన్ని రోజులుగా యువతను మోసం చేసిన ధోకేబాజ్ రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి. పేదల భూములను నిషేధిత జాబితాలో పెడుతున్న కాంగ్రెస్‌ను రాబోయే రోజుల్లో ప్రజలే నిషేధిత జాబితాలో పెట్టడం ఖాయం' అని అన్నారు.
పాలిటెక్నిక్ భూములపై కాంగ్రెస్ కన్ను..
సిరిసిల్ల, వేములవాడ (అగ్రహారం) పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులను కలిసి కేటీఆర్ మాట్లాడారు. జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20 రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు బీఆర్ఎస్ పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పాలిటెక్నిక్ కళాశాలలను లేబర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 97 వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్, సిరిసిల్ల, కరీంనగర్‌లోని విలువైన పాలిటెక్నిక్ భూములు, ఆస్తులను ఇతర అవసరాలకు మళ్లించేందుకే ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. జీవో 97ను రద్దు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులపై కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ పర్యటనలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

# పాక్ చిత్తు చిత్తు!

**-7 వికెట్ల తేడాతో టీమిండియా హ్యాట్రిక్ విక్టరీ**
**-55 పరుగులకే చాపచుట్టేసిన దాయాది**
**--8.4 ఓవర్లలోనే ఛేదించిన భారత్**
**--ఓటమితో మూసుకుపోయిన పాక్ సెమీస్ దారులు**
**--అత్యధిక మ్యాచ్‌లాడిన కెప్టెన్‌గా కౌర్ రికార్డు**
**-మహిళల టీ20 ఆసియా కప్ టోర్నీ**




దుబాయ్:
మహిళల ఆసియా కప్ 2026 గ్రూప్-ఎ బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌లో భారత్ హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకుంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో రికార్డు విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నది. ఇప్పటికే వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి సెమీఫైనల్‌కు చేరిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం.. పాక్‌ను మట్టికరిపించి వరుసగా మూడో విజయాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 55 పరుగులకే కుప్పకూలింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 8.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి సాధించింది. తొలుత పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనా రెండో ఓవర్లో షఫాలీ వర్మ (12) ను అవుట్ చేసింది. లెంగ్త్ బంతిని ఆన్-సైడ్ వైపు పంచ్ చేయడానికి షఫాలీ ప్రయత్నించగా, బంతి బ్యాట్ అంచుకు తగిలింది. ఆ బంతిని తన ఫాలో-త్రూలో రజికా పట్టుకుంది. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన ప్రతీకా రావల్ రేజింగ్‌లో బౌండరీతో ఖాతాను తెరిచి.. ఓవర్ చివరి బంతికి ప్రతీకా రావల్ (4) క్యాచ్-బిహైండ్ అయ్యింది. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన స్మృతి మంధాన.. క్రీజులో ముందుకు వచ్చి ఫాతిమా సనా విసిరిన బంతిని మిడ్-వికెట్ దిశగా బలంగా బాది అద్భుతమైన ఫోర్ సాధించింది. అయితే ఆ పేసర్ వెంటనే కోలుకుని బంతిని కొంచెం ఫుల్ లెంగ్త్‌లో విసరగా, అది మంధాన ప్యాడ్లకు తగలడంతో ఆమె ఎల్బీడబ్ల్యూగా (9) వెనుదిరిగింది. కాగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 18 పరుగులు, దీప్తి శర్మ 12 పరుగులు చేయడంతో భారత్ ఘన విజయం సాధించింది. భారత జట్టు 8.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 57 పరుగులు చేసింది.
పాక్ అతి తక్కువ స్కోర్..
టాస్ గెలిచిన పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. పాకిస్తాన్ ఓపెనర్లుగా మునీబా అలీ, షవాల్ జుల్ఫికర్ క్రీజులోకి రాగానే మనోళ్లు రెచ్చిపోవడంతో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్ 18.1 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు మునీబా అలీ (13), షవాల్ జుల్ఫికర్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మిగతా వారంతా సింగిల్ డిజిట్ స్కోర్‌కే వెనుదిరిగారు. గుల్ ఫిరోజా, ఫాతిమా సనా, నష్రా సుందు డకౌట్ అయ్యారు. భారత్ బౌలర్లలో నల్లపురెడ్డి చరణి, ప్రేమ్ రావత్ చెరో 3 వికెట్లు తీయగా.. దీప్తి శర్మ 2 వికెట్లు, షఫాలీ వర్మ 1 వికెట్ తీసి పాక్ నడ్డి విరిచారు. పాకిస్తాన్ జట్టుకు టీ20ల్లో ఇదే అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. అంతకుముందు పాక్ 2024లో న్యూజిలాండ్‌పై 56 పరుగులకు ఆలౌటైంది.
మహిళల టీ20ల్లో కెప్టెన్‌గా అరుదైన రికార్డు
మహిళల టీ20 ఆసియా కప్ టోర్నీ 2026లో భాగంగా శనివారం దుబాయ్ వేదికగా భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో భారత్ కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన ఫీట్ సాధించింది. మహిళల అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో కెప్టెన్‌గా అత్యధిక మ్యాచ్‌లు ఆడిన వారిలో హర్మన్ తొలి స్థానంలో నిలిచింది. హర్మన్‌కు కెప్టెన్‌గా ఇది 150వ మ్యాచ్. పురుషుల, మహిళల క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన రికార్డు కూడా హర్మన్ పేరిటనే ఉండటం విశేషం. ఈ జాబితాలో శ్రీలంక కెప్టెన్ చమరి అతపట్టు (121) రెండో స్థానంలో, ఆస్ట్రేలియాకు చెందిన మెగ్ లానింగ్ (100), ఇంగ్లాండ్ హెదర్ నైట్ (96) మ్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. కాగా, హాంగ్‌కాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో స్మృతి మంధాన 124 పరుగులతో రికార్డు శతకం నమోదు చేసి, మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచారు.

# బీఆర్ఎస్ కోటలపై దండయాత్ర

మొదటి తరువాయి

అని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ?వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలో రూ.32 కోట్లతో నిర్మించిన వంద పడకల ఏరియా ఆస్పత్రిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అక్కడే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలపై ఘాటైన విమర్శలతో రాజకీయాలను వేడి పుట్టించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేండ్లు పాలించిన బీఆర్ఎస్ అన్ని రకాలుగా రాష్ట్రాన్ని ముంచి గద్దెదిగిపోయిందని విమర్శించారు. 'బీఆర్ఎస్ కోటలపై కాంగ్రెస్ దండయాత్ర చేస్తుంది. ?సిరిసిల్ల, సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా పాతుతాం' అని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులో సిరిసిల్లకు వెళ్లి మూడు రంగుల జెండా ఎగురవేస్తానని, ఆ తర్వాత సిద్దిపేటపై దండయాత్ర చేస్తానని ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి వచ్చే విమర్శలకు ఇకపై వెనక్కి తగ్గేది లేదని ష్టంచేశారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని బందిపోట్లులా దోచుకున్నారని అన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు మోసపోయారని గుర్తుచేశారు. చివరి విడత రైతు భరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని చెప్పారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. 'నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు, నాకు చదువు లేకపోయినా సంస్కారం ఉంది, అందుకే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నాను' అని తెలిపారు. ఎక్కడ ఆస్తి రాసి ఇవ్వాల్సి వస్తుందోనని చెల్లెని బయటకు గెంటేశారని వ్యాఖ్యానించారు. నాలుగు ఇంగ్లీషు ముక్కలు వస్తే సరిపోదని, ఆడబిడ్డను చూసుకోవాలన్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని, ఆ పార్టీది అంతా చీకటిమయం అని అన్నారు. రేవంత్ ఉన్నంతకాలం బీఆర్ఎస్ అనే మొక్కనే ఎదగనివ్వనని అన్నారు. తెలంగాణ తులసివనంలో గంజాయి మొక్కను పీకుతామన్నారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ 90 స్థానాలు గెలిచి తిరిగి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, నియోజకవర్గాల పునర్విభజన జరిగితే 117 స్థానాల్లోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.
రైతు.. మహిళ.. యువతపై ఫోకస్
రైతు రుణమాఫీ, రైతుభరోసా, ధాన్యం కొనుగోళ్లు, సన్నవడ్ల బోనస్, ఉచిత విద్యుత్ ద్వారా రైతులకు రూ.1.70 లక్షల కోట్ల మేర ప్రయోజనం కల్పించామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలో 25.35 లక్షల మంది రైతులకు రూ.18,617 కోట్ల రుణమాఫీ చేశామని, రైతుభరోసా కింద రూ.36 వేల కోట్లు, ధాన్యం కొనుగోళ్లకు రూ.90 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రస్తావించిన సీఎం.. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని తెలిపారు. ?కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రశ్నపత్రాల లీకేజీలు, నియామకాల జాప్యంతో నిరుద్యోగ యువత నష్టపోయిందని విమర్శించారు.

# 22ఏతో ప్రజల ఆస్తుల దోపిడీ..

మొదటి తరువాయి

తెలంగాణను ప్రైవేట్ రియల్ ఎస్టేట్ కంపెనీలా మార్చేశారని, ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా రాష్ట్రంలో భూములు అమ్మి డబ్బులు పంపుతున్నారని పేర్కొన్నారు. ప్రజాపాలనలో ధర్నా చేసేందుకు సిద్ధపడితే హౌస్ అరెస్టులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేట్ భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు కాంగ్రెస్ నాయకులు 30 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు.+వశీస్త్రతీఖుజూష్ట్రఅవ్ష నిషేధిత జాబితా పేరిట జరుగుతున్న దందాపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మానవ హక్కులను సర్కార్ కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## బీఎల్ఏ దాడిలో 25 మంది పాక్ సైనికులు మృతి

న్యూఢిల్లీ,
పాకిస్తాన్‌లో కొంతకాలంగా పాక్ సైన్యానికి, బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)కు మధ్య భీకర పోరు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇరుపక్షాలు పరస్పరం దాడి చేసుకుంటున్నాయి. తాజాగా బీఎల్ఏ జరిపిన దాడిలో 25 మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. ఈ విషయాన్ని బీఎల్ఏ తాజాగా వెల్లడించింది. పాక్ దాడులకు బదులుగా, బీఎల్ఏ జరిపిన వేర్వేరు దాడుల్లో పాక్ సైనికులు మరణించినట్లు తెలిపింది.దీంతో బెలూచిస్తాన్ ప్రాంతంలో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను కూడా బీఎల్ఏ రిలీజ్ చేసింది. బీఎల్ఏకు చెందిన ఫతేహ్ స్క్వాడ్ ఈ దాడి చేసినట్లు ప్రకటించింది. శుక్రవారం జియారత్ క్రాస్ వద్ద పాక్ మిలిటరీ కాన్వాయ్‌కు చెందిన రెండు వాహనాలు వెళ్తుండగా బీఎల్ఏ దాడి చేసింది. ఈ ఘటనలో 18 మంది పాక్ సైనికులు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. ఫతేహ్ స్క్వాడ్.. బీఎల్ఏలో చాలా బలమైన సాయుధ రెబల్ గ్రూప్. బెలూచిస్తాన్ పర్వత ప్రాంతాల్లో, గ్వెరిల్లా తరహా మెరుపు దాడులు చేయగల సామర్థ్యం ఈ గ్రూప్ సొంతం. ప్రమాదకరమైన దాడుల్ని ఈ గ్రూప్ చేపడుతుంది. గత ఏడాది మార్చిలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసింది కూడా ఈ గ్రూపే. మరో ఘటన సూరబ్ పరిధిలోని హజికా ప్రాంతంలో జరిగింది. బీఎల్ఏకు చెందిన ఎస్టీఓఎస్ గ్రూపు పాక్ సైన్యంపై దాడి చేసింది. రిమోట్ కంట్రోల్ వాహనంతో దాడి చేయగా, ఏడుగురు సైనికులు మరణించారు. ఈ రెండు దాడులపై పాక్ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. ఈ ఘటనలు పాక్ సైన్యం వైఫల్యంగా అక్కడి విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ వైఫల్యంగా స్థానికులు ఆరోపిస్తున్నారు. పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెలూచిస్తాన్‌లో కొంతకాలంగా ఆందోళనలు జరుగుతున్నాయి.

# పిల్లల కన్నా వృద్ధుల జనాభా ఎక్కువ!


**-మానవ చరిత్రలో ఇదే తొలిసారి**
**-2025లో తొలిసారి వృద్ధుల జనాభా అధికం**
**-ఐదేళ్లలోపు పిల్లల సంఖ్యను దాటిన వృద్ధులు**
**-తగ్గుతున్న జననాల రేటుతో మారుతున్న జనాభా**
**-పెరుగుతున్న ఆయుర్దాయంతో వృద్ధుల సంఖ్య పెరుగుదల**
**-2025లో 65 ఏళ్లు పైబడిన వారు 85.20 కోట్లు**
**-2060 నాటికి 200 కోట్లకు చేరనున్న వృద్ధులు**
**-ప్రపంచ జనాభాలో 55 శాతం పెరుగుదల వృద్ధుల్లోనే**
**-2060 నాటికి ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులే**



న్యూఢిల్లీ,
మానవ చరిత్రలో మొదటిసారి ప్రపంచవ్యాప్తంగా ఐదేండ్లు లేదా అంతకంటే తక్కువ వయసు ఉన్న పిల్లల సంఖ్య కంటే వృద్ధుల సంఖ్య ఇప్పుడు ఎక్కువగా ఉంది. అమెరికా సెన్సస్ బ్యూరో నివేదిక ప్రకారం 2025లో ఈ జనాభా సంబంధిత మార్పు సంభవించింది. తగ్గుతున్న జననాల రేటు, పెరుగుతున్న ఆయుర్దాయం కారణంగా గత ఐదేండ్లలో ప్రపంచవ్యాప్తంగా 65 ఏండ్లు పైబడిన వారి జనాభా శిశువులు, పసిపిల్లలు, ప్రీస్కూల్ పిల్లల జనాభాను అధిగమించింది.
ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక వృద్ధ జనాభా కలిగిన దేశాల జాబితాలో అమెరికా 48వ స్థానంలో ఉంది. అక్కడ 65 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్నవారి జనాభా 18.9 శాతంగా ఉంది. 2056 నాటికి ఈ సంఖ్య 23.4 శాతానికి పెరుగుతుందని అంచనా. అయితే ఇతర దేశాలలో వృద్ధాప్య జనాభా సంఖ్య వేగంగా పెరుగుతుండడంతో అమెరికా ర్యాంకింగ్ 110వ స్థానానికి పడిపోయే అవకాశం ఉంది.
2060 నాటికి...
65 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారి సంఖ్య 2025 నాటికి 85.20 కోట్లు ఉండగా 2060 నాటికి అది 200 కోట్లకు పెరుగుతుందని అంచనా. ఈ కాలంలో ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే మొత్తం నికర జనాభా పెరుగుదలలో ఇది ఏకంగా 55 శాతానికి సమానంగా ఉంటుందని ఆక్సియోస్ పేర్కొంది. 2025 నాటికి ప్రపంచ జనాభా 813 కోట్లు ఉండగా 2060 నాటికి అది 1,023 కోట్లకు చేరుకుంటుందని అంచనా. అంటే భూమిపై ఉన్న ప్రతి ఐదుగురిలో ఒకరు 65 ఏండ్లు పైబడినవారు ఉంటారు.

# 4 రాష్ట్రాల్లో ముందుగానే జనగణన.

**-గోవా, యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్‌కు వర్తింపు**
**-డిసెంబర్ 1 నుంచి జనవరి 4 వరకు గణన**
**-జనవరి 5 నుంచి 9 వరకు సమీక్ష దశ**
**-జనగణన చట్టం ప్రకారమే నిర్ణయం**
**-షెడ్యూల్‌ను ధ్రువీకరించిన రిజిస్ట్రార్ జనరల్**
**-కేంద్రం నిర్ణయంపై జైరామ్ రమేశ్ ప్రశ్నలు**
**-ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యపై కాంగ్రెస్ విమర్శ**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:**
జనగణన 2027 ప్రక్రియలో భాగంగా గోవా, ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్, మంచు ఉండని ఉత్తరాఖండ్ ప్రాంతాలలో జనాభా లెక్కింపు షెడ్యూల్‌ను కేంద్ర ప్రభుత్వం ముందుగానే చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం శనివారం జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ రాష్ట్రాలు, ప్రాంతాల్లో జన గణన డిసెంబర్ 1 నుంచి 2027 జనవరి 4 వరకు జరుగుతుంది. అనంతరం జనవరి 5 నుంచి 9 వరకు సమీక్ష దశ నిర్వహిస్తారు. జన గణన చట్టం, 1948, జన గణన నియమావళి, 1990లో నిబంధనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు నోటిఫికేషన్ పేర్కొన్నది.భారత రిజిస్ట్రార్ జనరల్(ఆర్‌జీఐ) కూడా ఈ షెడ్యూల్‌ను ధృవీకరించారు. కాగా ఈ ఆకస్మిక చర్యను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పేలవమైన ప్రణాళికను ప్రతిబింబిస్తుందని ఆయన విమర్శించారు. 2027లో నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయని ప్రభుత్వానికి తెలిసినప్పటికీ గణన ప్రక్రియను ఇప్పుడు ఎందుకు ముందుకు జరుపుతున్నారని ఆయన ప్రశ్నించారు.

# కుల గణనతోనే సామాజిక న్యాయం-కొప్పుల రాజు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :

భారతదేశంలో నేటికీ ప్రతి కులానికి సంబంధించిన జనాభా, సామాజిక వెనుకబాటుతనం, ప్రభుత్వ రంగాల్లో ప్రాతినిధ్యంపై ఖచ్చితమైన సమాచారం అందుబాటులో లేదని ఏఐసీసీ సభ్యులు, జార్ఖండ్ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొప్పుల రాజు అన్నారు. కుల గణన నిర్వహించాలన్న డిమాండ్‌కు ఇదే ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం గాంధీ భవన్‌లో కుల గణన అంశంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొప్పుల రాజు మాట్లాడుతూ, OBCల విషయంలో మండల్ కమిషన్ కూడా చాలా వరకు 1931 నాటి జనాభా గణాంకాలపైనే ఆధారపడాల్సి వచ్చిందని గుర్తుచేశారు. కులాల వారీగా ప్రస్తుత జనాభా, సామాజిక–ఆర్థిక పరిస్థితులు, విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన తాజా సమాచారం లేకుండా న్యాయమైన వాటా, సమానత్వం సాధ్యం కాదని అన్నారు.




## కులాల వారీ వివరాలు సేకరించాలి

రాబోయే జనాభా గణనలో SC, ST, OBC, జనరల్ కేటగిరీల కోసం రాష్ట్రాలవారీ జాబితాలతో పాటు, కేటగిరీ మరియు కులం కోసం ప్రత్యేక డ్రాప్‌డౌన్ ఆప్షన్లు చేర్చాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందని కొప్పుల రాజు తెలిపారు.
SC, ST, OBC, EWS కేటగిరీల వర్గీకరణ, రిజర్వేషన్ల అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఇప్పటికే కేటగిరీలకు సంబంధించిన జాబితాలు అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు. కాబట్టి కులాల వారీగా వివరాలను నమోదు చేయడం పెద్ద సమస్య కాదని పేర్కొన్నారు. ఇంకా సమయం ఉందని, హౌస్‌లిస్టింగ్ దశలో ఇప్పటివరకు కుల సంబంధిత వివరాలను సేకరించలేదని ఆయన తెలిపారు. జనాభా లెక్కల (Population Enumeration) ప్రక్రియ 2027 ఫిబ్రవరి నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్నందున, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కులాల వారీ వివరాలను జనాభా గణనలో చేర్చాలని డిమాండ్ చేశారు.
OBCల విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరి OBC సాధికారత పేరుతో ప్రకటనలు చేయడం, ఆచరణలో మాత్రం వారి హక్కులను బలహీనపరచడం బీజేపీకి ఒక స్థిరమైన విధానంగా మారిందని కొప్పుల రాజు విమర్శించారు. కుల గణన ద్వారా అందుబాటులోకి వచ్చే వాస్తవ గణాంకాల ఆధారంగా విధానాలను రూపొందించి, అణగారిన మరియు వెనుకబడిన వర్గాలకు వారి జనాభా, అవసరాలకు అనుగుణంగా న్యాయమైన వాటా, సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని కొప్పుల రాజు అన్నారు.

# షాద్ నగర్ చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులతో సమీక్ష

**అధికారులకు పలు కీలక సూచనలు.. పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదేశం**

రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 05 ( జర్నలిస్ట్ డైరీ) :

షాద్‌నగర్,చటాన్‌పల్లి వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణ పనులపై షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గారు శనివారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. షాద్‌నగర్‌లోని స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆర్‌ఓబీ నిర్మాణానికి సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. వివరంగా చర్చించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే చటాన్‌పల్లి పరిసర ప్రాంత ప్రజలకు, వాహనదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యవంతమైన



మార్గం ఏర్పడుతుందని తెలిపారు. అందువల్ల నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
సమీక్ష సందర్భంగా వివిధ శాఖల పరిధిలో చేపట్టాల్సిన పనులు, అవసరమైన అనుమతులు, రహదారి సంబంధిత అంశాలు, విద్యుత్ లైన్ల మార్పిడి, మిషన్ భగీరథ పైపులైన్లకు సంబంధించిన సమస్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ఆర్‌ఓబీ నిర్మాణానికి సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. అన్నారు. సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక ఆర్డీవో ఎన్.ఆర్. సరిత, డీఈ ఆర్‌డబి స్థానిక మున్సిపల్ కమిషనర్ స్థానిక ఎమ్మార్వో నాగయ్య. శ్రీమతి సునీత, పోలీస్ శాఖ తరఫున ట్రాఫిక్ సీఐ శంకరయ్య, మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆర్‌ఓబీ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు ఈ సందర్భంగా నిర్ణయించారు.

# లక్ష్మీదేవిపల్లి డీపీఆర్ ఏది..?

**-2.8 టీఎంసీల సామర్థ్యంతో రైతులకు ఎంత ప్రయోజనం..?**

**-డేటా సెంటర్ల కోసమేనా రిజర్వాయర్ హడావుడి..?**

**-ప్రజా సంఘాల నాయకుల డిమాండ్**

రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలకమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను వెంటనే బహిర్గతం చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుమలయ్య, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు అర్జునప్ప, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ కర్ణకోట రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ.. పాలమూరు ప్రాంత కరువు, వలసలను అరికట్టేందుకు పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కోసం తెలంగాణ ఉద్యమ కాలం నుంచే ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామికవాదులు పెద్దఎత్తున పోరాటాలు చేశారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రాజెక్టు రూపకల్పనలో మార్పులు చేసి శ్రీశైలం నుంచి నీటిని ఎత్తిపోసే విధంగా పథకాన్ని రూపొందించారని తెలిపారు. ఆరు రిజర్వాయర్ల నిర్మాణంలో చివరిదైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ద్వారా సుమారు 2.70 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందిస్తామని గతంలో ప్రకటించినప్పటికీ, రిజర్వాయర్ నిర్మాణాన్ని విస్మరించారని ఆరోపించారు. దీనిపై షాద్‌నగర్ ప్రాంత ప్రజలు, ప్రజా సంఘాలు అనేక రూపాల్లో ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయని తెలిపారు.



## 2.8 టీఎంసీలతో ప్రయోజనం ఎంత..?

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కోసం భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేయడం స్వాగతించదగ్గ పరిణామమేనని పేర్కొన్న వారు.. అయితే రిజర్వాయర్ సామర్థ్యాన్ని కేవలం 2.8 టీఎంసీలుగా పేర్కొనడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఇంత తక్కువ సామర్థ్యంతో ఎన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్‌ను కేవలం తాగునీటి ప్రాజెక్టుగా పేర్కొనడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ ప్రాజెక్టు అసలు లక్ష్యం రైతులకు సాగునీరు అందించడమేనని, కేవలం తాగునీటి అవసరాలకు పరిమితం చేస్తే పాలమూరు రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు.

## డేటా సెంటర్ల కోసమేనా..?

షాద్‌నగర్ పరిధిలో ఏర్పాటవుతున్న డేటా సెంటర్లకు నీటిని అందించేందుకే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వం హడావుడి చేస్తోందా? అనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఎలికట్ట, మేకగూడ ప్రాంతాల్లో డేటా సెంటర్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, మరికొన్ని ప్రాజెక్టులకు అనుమతులు లభించినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. డేటా సెంటర్లలో సర్వర్లను శీతలీకరించేందుకు భారీగా నీటి అవసరం ఉంటుందని, ఆ నీటిని ఎక్కడి నుంచి సమకూర్చుతారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూగర్భ జలాలపై ఆధారపడితే భవిష్యత్తులో ఈ ప్రాంతంలో నీటి కొరత మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
రిజర్వాయర్ పూర్తి డీపీఆర్‌ను ప్రజల ముందు ఉంచి.. ఈ ప్రాంత రైతులకు ప్రాజెక్టు ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని వారు కోరారు.

## డిండి ఎత్తిపోతలపై అభ్యంతరం

డిండి ఎత్తిపోతల పథకం పేరుతో నల్గొండ జిల్లాకు నీటిని తరలించడం వల్ల పాలమూరు రైతాంగానికి నష్టం జరుగుతుందని వారు అన్నారు. పాలమూరు రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలను ప్రజాప్రతినిధులందరూ వ్యతిరేకించాలని కోరారు. ప్రాణహిత--చేవెళ్ల, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల ద్వారా లక్ష్మీదేవిపల్లికి నీటిని తరలించి చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు, షాద్‌నగర్, మహేశ్వరం ప్రాంతాలతో పాటు నల్గొండ రైతాంగానికి సాగు, తాగునీరు అందించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# టిఆర్పి షాద్నగర్ నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా మీదికేరి రాధాకృష్ణ

రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :



తెలంగాణ రాజ్యాధికార పార్టీ (TRP) షాద్నగర్ నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా మీదికేరి రాధాకృష్ణ గారిని ఎన్నుకున్నారు. శనివారం హైదరాబాద్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు తీన్మార్ మల్లన్న గారు రాధాకృష్ణ గారికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ... తీన్మార్ మల్లన్న గారు బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు పోరాటాన్ని మెచ్చి పార్టీలో చేరడం జరిగింది రాష్ట్ర అధ్యక్షులు ఆదేశా అనుసారం బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం వచ్చేవరకు పోరాటం సాగిస్తామని జనాభా ప్రాతిపదికంగా రాజ్యాధికారం ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బండారి రమేష్ యాదవ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు నరసయ్య గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధన్, రాష్ట్ర నాయకురాలు వాసుకి, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి జిల్లా అధికార ప్రతినిధి బూస జంగన్న,తాలూకా అధ్యక్షులు ఎమ్మె సంతోష్,కొందుర్గు మండల అధ్యక్షులు దర్గా వెంకటయ్య, చౌదర్ గూడెం మండల అధ్యక్షులు రాములు, , గుండ్ల నవీన్, కాశ యాదయ్య, రామచంద్రయ్య మరియు నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ సారథి ప్రొఫెసర్ కోదండరాం సార్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**– తెలంగాణ ఉద్యమంలో కోదండరాం సేవలు ఆదర్శం: టీ.జీ. శ్రీనివాస్**




రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ సారథి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం గారికి తెలంగాణ ఉద్యమ జేఏసీ షాద్‌నగర్ అధ్యక్షుడు టీ.జీ. శ్రీనివాస్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులను సమన్వయం చేస్తూ ఉద్యమాన్ని ముందుకు నడిపిన ప్రొఫెసర్ కోదండరాం సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తూ ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని నడిపించడంలో కోదండరాం కీలక భూమిక పోషించారని టీ.జీ. శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు, కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూ ప్రజల ఆకాంక్షలను బలంగా వినిపించారని అన్నారు. పదవులకంటే ప్రజా సమస్యలకు, తెలంగాణ ప్రజల హక్కులకు ప్రాధాన్యతనిచ్చే వ్యక్తిగా కోదండరాం ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో ప్రొఫెసర్ కోదండరాం పేరు ఎప్పటికీ నిలిచిపోతుందని, ఆయన సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని టీ.జీ. శ్రీనివాస్ అన్నారు. కోదండరాం సార్ ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

**-బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**

**-జంగోనిగూడలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు**

రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :



నందిగామ మండలం అంతిరెడ్డిగూడ గ్రామ పరిధిలోని జంగోనిగూడలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ తల్లి, శ్రీ పోచమ్మ తల్లి, శ్రీ శీతలా బొడ్రాయి నాభిశిల ప్రతిష్ఠ, శ్రీ మైసమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈ ప్రతిష్ఠ మహోత్సవానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ హాజరై అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు రవీందర్ యాదవ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో జంగోనిగూడ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సమృద్ధులతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామంలో భక్తి, ఆధ్యాత్మికతతో కూడిన ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకట్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, సర్పంచులు మంజుల యాదగిరి, జెట్ట కుమార్, మాజీ సర్పంచ్ శ్రవణ్ పట్వారీ, నాయకులు కుమార్ గౌడ్, శ్రీశైలం, మల్లేష్ యాదవ్, శ్రీను, రజినీకాంత్, చందు, శ్రీనివాస్, శ్రీకాంత్, పాపయ్య యాదవ్, రవి నాయక్, ఈశ్వర్, శేఖర్, ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి




**ఇబ్రహీంపట్నం (సెప్టెంబర్5)జర్నలిస్ట్ డైరీ.**
విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం సాగర్ హైవేపై భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో సుమారు 3,000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.
కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచి రెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పదో తరగతి విద్యార్థులకు రూ.10 వేల సాయం, విద్యార్థినులకు స్కూటీలు, మహిళలకు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ నిధులు విడుదల చేయాలని మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.
విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా యువత ఏకతాటిపైకి..!

**-వై.ఏం. తండాలో SDVP JAC గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**
**-పార్టీలకు అతీతంగా ఉద్యమం..**
**డంపింగ్ యార్డు రద్దే ఏకైక లక్ష్యం**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :**
రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఏర్పడిన సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (రాణవూ జీూాజ) గ్రామస్థాయిలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి వై.ఏం. తండాలో గ్రామ పెద్దలు, యువతతో సమావేశం నిర్వహించి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**పార్టీలకు అతీతంగా ఉద్యమం**
సమావేశంలో జేఏసీ చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, కోఆర్డినేటర్లు తిరుమలయ్య, టీజీ శ్రీనివాస్, అర్జునప్ప పాల్గొని డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన కార్యాచరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉద్యమానికి సంబంధించి ప్రజల నుంచి వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు.
ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు రద్దు కావాలంటే రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా స్వచ్ఛందంగా ఉద్యమంలోకి రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఈ పోరాటంలో కీలక భూమిక పోషించాలని కోరారు.
"ముందు గ్రామం.. ఆ తర్వాతే రాజకీయాలు. గ్రామమే లేకపోతే రాజకీయాలకు, పార్టీలకు భవిష్యత్తే ఉండదు" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. పార్టీలకు అతీతంగా ఒకే లక్ష్యంతో ప్రజలంతా ఐక్యంగా పోరాడి డంపింగ్ యార్డు రద్దు సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

**జేఏసీ జెండా కిందనే పోరాటం**
ఇకపై చేపట్టే దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో జేఏసీ జెండాలు, జేఏసీ కండువాలు మాత్రమే ఉంటాయని.. ఏ రాజకీయ పార్టీ జెండాలు, కండువాలకు చోటు ఉండదని నాయకులు స్పష్టం చేశారు. గ్రామ ప్రజల ఐక్యతే ఉద్యమానికి ప్రధాన బలమని పేర్కొన్నారు.

**వై.ఏం. తండా జేఏసీ కమిటీ**
అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
సలహాదారులుగా: రాంచందర్ (మాజీ ఎంపీటీసీ), రమేష్ (మాజీ సర్పంచ్), బాబు రాజు.
గౌరవ అధ్యక్షుడిగా: గోవింద్ నాయక్ (సర్పంచ్).
అధ్యక్షుడిగా: పార్లావత్ నాగేష్.
ఉపాధ్యక్షులుగా: పాత్లావత్ నరేష్, లక్ష్మణ్, జైపాల్.
ప్రధాన కార్యదర్శిగా: పాట్లావత్ వినోద్.
సహాయ కార్యదర్శులుగా: పార్లావత్ శంకర్, సబావత్ కుమార్, సంతోష్.కార్యవర్గ సభ్యులుగా: పాత్లావత్ సీతారాం, నార్యా, నరేష్, లక్ష్మణ్, హనుమంతు, నేనావత్ లక్ష్మణ్, రాము, రమేష్, పెంట్యాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ ఎన్నికతో వై.ఏం. తండాలో డంపింగ్ యార్డుకు వ్యతిరేక ఉద్యమం మరింత ఉధృతం కానుందని జేఏసీ నాయకులు తెలిపారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదములు

**– తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోయ నాగరాజు నాయుడు**



**జర్నలిస్ట్ డైరీ కర్నూల్,**
శుక్రవారం ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయాల పట్ల తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోయ నాగరాజు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డిఏలు ప్రకటించడం, పిఆర్సి కమిటీ నియమించడం ,సరెండర్ లీవ్స్ పై నిర్ణయం తీసుకోవడం, ఉద్యోగుల ఆర్థిక బకాయిలన్నీ చెల్లింపు వంటి అంశాలపై సానుకూల నిర్ణయాలు ప్రకటించిన అంశంపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు నాయుడు, తదితరులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగులకు మేలు చేస్తున్నాయని , ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు నాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబుకి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# సమస్యలపై కాలనీ వాసులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :**
హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని మిత్ర హిల్స్ కాలనీ లో గల పార్క్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మరియు కాలనీ అసోసియేషన్ సభ్యులు మరియు కాలనీ వాసులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన పియేసీ చైర్మన్ ఆరెక పూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... మిత్ర హిల్స్ కాలనీ సొసైటీ పార్కు కోసం కేటాయించేలా తన వంతు శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు..
ఈ అంశాన్ని అనవసరంగా రాజకీయ వివాదంగా మార్చవద్దని కాలనీవాసులకు సూచించారు..రాజకీయ లబ్ధి కోసం కొందరు మిమ్మల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు..అలాంటి ప్రలోభాలకు లోనుకావద్దని సొసైటీ సభ్యులను కోరారు..గతంలో కొందరు కౌన్సిలర్లు తామే ఈ భూమిని పార్కు కోసం కేటాయించామని చెప్పడంపై కూడా ఎమ్మెల్యే స్పందించారు..
వారు కౌన్సిలర్లుగా ఉన్న సమయంలోనే అసలు మిత్ర హిల్స్ కాలనీ కూడా ప్లాటింగ్ కూడా జరగలేదని ఆయన వ్యాఖ్యానించారు..
3500 గజాల స్థలాన్ని మిత్ర హిల్స్ సొసైటీకి పార్కు రూపంలో మరియు కమ్యూనిటీ హాల్ కోసం వినియోగించే వరకు పోరాటం కొనసాగిస్తానని



కాలనీ వాసులకు హామీ ఇచ్చారు..కరోనా సమయంలో ఆక్సిజన్ కోసం ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసిన ఎమ్మెల్యే..
కాలనీలో అందుబాటులో ఉన్న పార్కు స్థలాల్లో చెట్లు పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మన అందరింపైన ఉందని, రానున్న తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చదనం అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని తెలిపారు..
మిత్ర హిల్స్ కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం అని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, పార్క్ సమస్య కూడా త్వరలోనే పరిష్కరిస్తామని, ప్రభుత్వం దృష్టికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా పరిష్కరిస్తామని, నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని , ఎవరు అధైర్య పడకూడదు అని, పార్క్ సమస్య కు త్వరలోనే పరిష్కారం లభిస్తుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు.
కాలనీలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయంటే అందులో గాంధీ పాత్ర ఎంతో ఉందని, కాలనీ లో రోడ్లు, డ్రైనేజీ ,మంచి నీటి వ్యవస్థ ను ఏర్పాటు చేయడం జరిగినది అని, ఎమ్మెల్యే నిధులతో బూస్టర్ ను ఏర్పాటు చేసి మంచి నీటి వ్యవస్థను కల్పించడం జరిగినది అని పలువురు కాలనీవాసులు తెలియచేశారు.

# షాద్ నగర్ బీఎస్పీలోకి రిటైర్డ్ హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ

**– బహుజన రాజ్యాధికారమే లక్ష్యం -బండమిది బాలయ్య**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :**
షాద్ నగర్ నియోజక వర్గంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)కి మరో కీలక చేరిక చోటుచేసుకుంది. హౌసింగ్ కార్పొరేషన్‌లో రిటైర్డ్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) బండమిది బాలయ్య బీఎస్పీలో చేరారు. రంగారెడ్డి జిల్లా బీఎస్పీ అధ్యక్షులు, అడ్వకేట్ దొడ్డి శ్రీనివాస్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా బండమిది బాలయ్య మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో ప్రజలతో మమేకమై పనిచేసిన అనుభవాన్ని ఇకపై సామాజిక న్యాయం, సమానత్వం, బహుజనుల హక్కుల కోసం వినియోగిస్తానని తెలిపారు. షాద్ నగర్ నియోజక వర్గంలో ప్రభుత్వ ఉద్యోగులను ఏకం చేసి, ఉద్యోగుల సమస్యలతో పాటు సామాజికంగా అణగారిన వర్గాల హక్కుల కోసం బీఎస్పీతో కలిసి పనిచేస్తానని స్పష్టం చేశారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన రాజ్యాంగ మార్గంలో, మాన్యవర్ కాన్షీరాం ఉద్యమ స్ఫూర్తితో బహుజన రాజ్యాధికార సాధన కోసం కృషి చేస్తానని బాలయ్య పేర్కొన్నారు. షాద్ నగర్‌లో బీఎస్పీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ షాద్ నగర్ అసెంబ్లీ ఇంచార్జ్ తుప్పరి కుమార్, అసెంబ్లీ అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కొండేటి మహేందర్, చౌదర్‌గూడ మండల అధ్యక్షులు ఆర్. చెన్నయ్య, కమ్మదనం సెక్టార్ ప్రెసిడెంట్ పెద్దింటి ఆంజనేయులు, ఆగిరాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుకు కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీరారెడ్డి లేఖ..

**-జీవో 102 రద్దుపై కీలక విజ్ఞప్తి**
**-మెడికల్ అడ్మిషన్లలో 'ఆల్ ఆప్షన్స్' రద్దు చేస్తూ ఇచ్చిన జీవో 102పై ఆందోళన**
**-ఈ జీవోతో 70 మంది రిజర్వ్ కేటగిరీ మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆరోపణ**
**-జీవో 102ను రద్దు చేసి, పాత జీవో 151ని కొనసాగించాలని**
**ప్రభుత్వానికి వినతి**
**-ఇది సామాజిక న్యాయం, మెరిట్‌కు సంబంధించిన విషయమని లేఖలో స్పష్టీకరణ**




**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
రాష్ట్రంలో వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నెం. 102పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎన్. రఘువీరారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన శనివారం ఒక లేఖ రాశారు. మెడికల్ కౌన్సెలింగ్‌లో 'ఆల్ ఆప్షన్స్' విధానాన్ని రద్దు చేస్తూ జారీ చేసిన ఈ జీవో వల్ల మెరిట్ విద్యార్థులకు, సామాజిక న్యాయానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆయన ఆరోపించారు.గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు నిపుణుల కమిటీ సిఫార్సులతో జీవో నెం. 151ను జారీ చేశారని, దాని ప్రకారం 'ఆల్ ఆప్షన్స్' విధానం పారదర్శకంగా అమలయ్యేదని రఘువీరారెడ్డి తన లేఖలో గుర్తు చేశారు. అయితే, 2026 జులై 30న జారీ చేసిన జీవో 102తో ఆ విధానాన్ని నిలిపివేయడం అన్యాయమని పేర్కొన్నారు. దీని దుష్ప్రభావం 2026 అడ్మిషన్లలో స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు.ఈ ఏడాది అడ్మిషన్లలో ఏయూ రీజియన్‌లో 43 మంది, ఎస్వీయూ రీజియన్‌లో 27 మంది, మొత్తం 70 మంది రిజర్వ్ కేటగిరీ విద్యార్థులు ఓపెన్ కాంపిటీషన్ కటాఫ్ కంటే మెరుగైన ర్యాంకులు సాధించినప్పటికీ, వారికి రిజర్వేషన్ కోటాలోనే సీట్లు కేటాయించారని రఘువీరారెడ్డి తన లేఖలో గణాంకాలతో సహా వివరించారు. వాస్తవానికి వీరికి ఓపెన్ కాంపిటీషన్‌లో సీట్లు కేటాయించి ఉంటే, ఆ 70 రిజర్వ్ సీట్లు వారి కేటగిరీలోని ఇతర విద్యార్థులకు దక్కేవని, తద్వారా సామాజిక న్యాయం జరిగేదని అభిప్రాయపడ్డారు.అందువల్ల, ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవో 102ను పునఃసమీక్షించాలని, 'ఆల్ ఆప్షన్స్' విధానాన్ని పునరుద్ధరించాలని, పాత జీవో 151ని యథాతథంగా కొనసాగించాలని రఘువీరా రెడ్డి డిమాండ్ చేశారు. 2026 అడ్మిషన్ల ప్రక్రియను సమీక్షించి, విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని కోరారు. ఇది మెరిట్, పారదర్శకత, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయమని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు

# భావి తరాల నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**-ఉపాధ్యాయుల పాత్ర సమాజ నిర్మాణంలో అత్యంత కీలకం**
**-సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకుని విద్యార్థులను తీర్చిదిద్దాలి**
**-కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు**
**-విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం**
**-విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి తగిన మార్గనిర్దేశం చేయాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

**కర్నూలు,**
భావి తరాల నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని, ఉపాధ్యాయులు సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. శనివారం డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమంలో కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ...తాను కూడా ఎం.ఎస్‌సి. పూర్తి చేసిన అనంతరం కాంట్రాక్ట్ లెక్చరర్‌గా ఉపాధ్యాయ వృత్తితోనే తన ప్రస్థానాన్ని ప్రారంభించానని ఎంపీ తెలిపారు. విద్యార్థులను ప్రతిరోజూ మేల్కొలుపుతూ, వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని గురుపూజోత్సవాన్ని నిర్వహించడం ద్వారా దేశానికి మార్గనిర్దేశం చేస్తున్న గురువుల సేవలను స్మరించుకునే అవకాశం లభిస్తోందన్నారు. విద్యార్థులు ఇంటికంటే ఎక్కువ సమయం పాఠశాలలో గడుపుతున్నందున వారి విద్యాభివృద్ధితో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. "ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర బాధ్యత గురువులపై ఉంది. వారికి నాణ్యమైన విద్యను అందించడం ద్వారా భావి తరాల అభివృద్ధికి బలమైన పునాది వేయాలి" అని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యాబోధనలోనూ మార్పులు అవసరమని, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులకు భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన విద్యను అందించాలని కోరారు. ఉపాధ్యాయులు తమ వృత్తికి న్యాయం చేస్తూ విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. జిల్లాలో అక్షరాస్యత శాతం మెరుగుపరచడంతో పాటు విద్యా రంగంలో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యా రంగ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు సహకరించాలని కోరారు. రాబోయే రోజుల్లో సాంకేతికతకు అనుగుణంగా విద్యాబోధనలో అవసరమైన మార్పులు చేసుకుంటూ, విద్యార్థులను భావి సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

**విద్యార్థులకు జ్ఞానంతో పాటు మానవీయ విలువలను అందించాలి**
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడం ఎంతో గొప్పదైన, పుణ్యప్రదమైన బాధ్యత అని పేర్కొన్నారు. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు వారి ప్రవర్తన, ఆలోచనా విధానం, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కంటే ఎక్కువ సమయాన్ని పాఠశాలల్లో, ఉపాధ్యాయుల సమక్షంలో గడుపుతున్నందున వారి భావోద్వేగ, మానసిక అవసరాలను కూడా ఉపాధ్యాయులు గుర్తించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థులలోని బలాలు, బలహీనతలను గుర్తించి, అవసరమైన సమయంలో తగిన మార్గనిర్దేశం, మానసిక మరియు భావోద్వేగ సహకారం అందించాలని తెలిపారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, సానుకూలమైన మార్గనిర్దేశం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు వారు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో నిర్వర్తించాలని కోరారు.

**ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు**
జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖల ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఉత్తమ సేవలకు గుర్తింపుగా లభించిన ఈ పురస్కారాలు మరింత బాధ్యతతో పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తన విద్యాభ్యాసంలో మార్గనిర్దేశం చేసిన గురువులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి వ్యక్తి జీవితంలో తొలి గురువు తల్లేనని పేర్కొంటూ, తన తల్లితో పాటు తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులందరికీ కలెక్టర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

**ఉపాధ్యాయులు భావి భారత పౌరులను తీర్చిదిద్దే శిల్పులు : పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి**
ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ...ఉపాధ్యాయులు భావి భారత పౌరులను తీర్చిదిద్దే శిల్పులని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు మానవీయ విలువలు, నైతికత, క్రమశిక్షణ వంటి అంశాలను కూడా ఉపాధ్యాయులు నేర్పించాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. డీఎస్సీ ద్వారా అధిక సంఖ్యలో ఉపాధ్యాయులుగా అవకాశం కల్పించిందని తెలిపారు.
అనంతరం గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. పాఠశాల విద్యాశాఖకు చెందిన 36 మంది, ఇంటర్మీడియట్ విద్యాశాఖకు చెందిన 12 మంది కలిపి మొత్తం 48 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో జి .సుధాకర్, సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లోకరాజు, ఇంటర్మీడియట్ ఆర్.ఐ.ఓ లాలెప్ప, తదితరులు పాల్గొన్నారు.

## సమష్టి కృషితో నాగోలు గ్రామంలో దేవత విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు విజయవంతం

**- మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం..**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం. దేవాలయ కమిటి సభ్యులు..

**జర్నలిస్ట్ డైరీ, నాగోలు:**
నాగోలు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీమహాకాళి. శ్రీ పోచమ్మ దేవాలయ దేవత విగ్రహా ప్రతిష్ఠా మహోత్సవాలు. శ్రీ కంఠమహేశ్వర స్వామి బోనాలు. శ్రీ పోచమ్మ. శ్రీ మహంకాళి. బీరప్ప గ్రామ దేవతల బోనాల ఉత్సవాలు, తొట్టెల, ఫలహార బండి ఊరేగింపును. నాగోలు గ్రామంలో జరిగిన ఉత్సవాలకు విజయవంతం చేసిన కమిటీ సభ్యులకు, గ్రామపెద్దలుకు సహకరించి వారికి నాగోలు శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ పాలక మండలి చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ, దేవలయ డైరెక్టర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం నాగోలు రామాలమంలో ఏర్పటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 23 నుండి 26 వరకు శ్రీ మహంకాళి. శ్రీ పోచమ్మ దేవాలయ దేవత విగ్రహా ప్రతిష్టా మహోత్సవాలు అందరి సహకారంతో అంగరంగా వైభవంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసిన వారికి అభినందనలు తెలియజేస్తూ సన్మానం చేశారు. భవిష్యత్తులో జరుగబోయే ఉత్సవాలను సైతం ఇదేవిధంగా ఆదరించి విజయవంతం చేయాలని భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహంకాళి, శ్రీ పోచమ్మ దేవాలయ కమిటి చైర్మన్లు చింతల సురేందర్ యాదవ్. బద్దర్ మహేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కందికంటి కన్నాగౌడ్, నాగోలు సుధాకర్ చారి. బద్దం ధనుంజయ్యగౌడ్, బద్దం నరేందర్ గౌడ్, పల్లె సీతరాములుగౌడ్, పల్లె సత్యనారాయణగౌడ్, చెర్కు శ్రీధర్ గౌడ్, రావుల సాయి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయంలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు



**నాంపల్లి ( సెప్టెంబర్ 05) జర్నలిస్ట్ డైరీ.**
సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో జ్యోతిష్య విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సత్కరించి, గురువుల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో గురువుల విలువ, విద్యార్థుల జీవితంలో వారి ప్రాముఖ్యత, సమాజ నిర్మాణంలో గురువుల పాత్రపై అధ్యాపకులు ప్రసంగించారు. గురువుల మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. గురువులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో గొప్ప సంప్రదాయమని, గురువుల బోధనలు జీవితాంతం విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయని వక్తలు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు గురువులకు పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మదనాచారి, ఫణీంద్ర, నరసింహాచారి, ప్రతిమ మరియు జోతిష్య విభాగం మొదటి రెండవ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

## 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన సంక్షేమం అభివృద్ధి దిశగా అడుగులు: కాంగ్రెస్ నాయకులు



సమావేశంతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఆర్కేపురం, ఎన్టీఆర్ నగర్ డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్ నేత, లింగస్వామిగౌడ్ తదిత రులు..

**జర్నలిస్ట్ డైరీ, ఆర్కేపురం:**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పరిపాలనతో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ దక్కుతుందని మహేశ్వరం నియోజకవర్గం శ్రీ రామకృష్ణాపురం డివి జన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత. ఎన్టీఆర్ నగర్ డివిజన్ అధ్యక్షులు ముప్పిడి లింగస్వామి గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తి అయిన సందర్భంగా శనివారం ఆర్కేపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం ఇంరార్జ్ కీచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసిసి సభ్యులు దేవ భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎం. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజుల్లో ప్రజల సంక్షేమం, అభివృద్ధి. సామాజిక న్యాయం కోసం రేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు మహిళలకు ఉచిత బస్సు, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుల్. రేషన్ కార్డులు. ప్రభుత్వ ఉద్యోగాలు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు ఇలాంటివి అనేక సంక్షేమ కార్యక్రమాలను ఒక్కొక్కటిగా నెరవేర్పుతున్నారు..వెయ్యి రోజుల పరిపాలనతో హామీలు నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ. అందులో భాగంగానే ఈరోజు 1000 రోజుల సంబరాలు జరుపుకుంటున్నాము. గత బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాల ప్రజలకు ఇచ్చిన హామీల నెరవేర్చకుండా మోసం చేసింది. రూ.2 లక్షల రుణమాఫీ. అర్హులైనుజారికి రేషన్ కార్డుల పంపిణీ చేసి ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుంది. 24 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. మఖ్యమంత్రిని చేస్తానని మోసం చేసిన కేసీఆర్ ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. ప్రజాసంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీని విమర్శించుకున్న పబ్బం కడుకోవాలని చూస్తే బిఆర్ఎస్ పార్టీని ప్రజల క్షమించతన్నారు. 22వ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రభుత్వ ఆస్తులు కాపాడుకోవడం కొరకు అని తెలిపారు. తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళు న్న సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిలక ఉపేందర్ రెడ్డి. గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావ్ రాష్ట్ర బీసీ నాయకులు గట్ల యంద్ర. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం మాజీ చైర్మన్ తలాట్ రమేష్ నేత దురా ప్రసాద్. రామకృష్ణగౌడ్, జిల్ల జగన్నాథం, పెద్దపూర సైదులు, వెంకటరమణారెడ్డి. యాదవ రెడ్డి, మహ్మద్ దుబ్బాక శేఖర్. ఎల్లన్న. బిక్షపతిగౌడ్, ఎన్టీఆర్ నగర్ మహిళా అధ్యక్షురాలు రేణుక, కృష్ణా రావు, అనంప్ కుమార్, సంతోష్ తదిత రులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**-సర్వేపల్లి జీవితం ఆదర్శనీయం**
**-ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువులకు చంద్రబాబు శుభాకాంక్షలు**
**-సర్వేపల్లి రాధాకృష్ణన్ విలువలను భావితరాలు పాటించాలని పిలుపునిచ్చిన సీఎం**



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి, మహోన్నత విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని, ఆయన స్మృత్యర్థం సోషల్ మీడియా వేదికగా ముఖ్యమంత్రి ఒక ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు.భావి భారత పౌరులను తీర్చిదిద్దుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. సమాజ నిర్మాణంలోనూ, విద్యారంగంలోనూ గురువుల పాత్ర ఎంతో అమూల్యమైనదని ఆయన కొనియాడారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అత్యంత సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన ఆయన, తన ఆదర్శవంతమైన జీవనశైలితో దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి బాధ్యతలను చేపట్టారని పేర్కొన్నారు. సర్వేపల్లి ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని.. ఆయన చూపిన మార్గాన్ని, పాటించిన విలువలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు

## ఈనెల 7 న 'పిజిఆర్ఎస్' కార్యక్రమం రద్దు

**మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత**

**మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
ఈనెల 7వ తేదీ (సోమవారం) నాడు కలెక్టరేట్‌లో నిర్వహించాల్సి ఉన్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, ఒక ప్రకటనలో తెలిపారు.?కొన్ని అత్యవసర పరిపాలనా కారణాలతో పాటు ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ మార్పును జిల్లాలోని అర్జీదారులు, ప్రజలందరూ గమనించి, సహకరించాల్సిందిగా కోరారు.

# ప్రపంచ పటాన్ని మార్చిన ఐక్యరాజ్యసమితి



**న్యూఢిల్లీ సెప్టెంబరు 05 (జర్నలిస్ట్ డైరీ) :** ప్రపంచ పటంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెం బ్లీ శుక్రవారం ఒక చారిత్రాత్మక తీర్మానాన్ని ఆమోదించింది. దీనికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది. తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఏకైక దేశం అమెరికా. ఈ నిర్ణయం దేశాలు లేదా ఖం డాల వాస్తవ వైశాల్యాన్ని ప్రభావితం చేయదు. ఇది కేవలం పటంలో అవి ఎంత పెద్దవిగా లేదా చిన్నవిగా కనిపిస్తాయనే అంశాన్ని మాత్రమే మారుస్తుంది. ఈ కొత్త మ్యాప్‌ను ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్ అని పిలుస్తారు. ఈ విధానంలో ఆఫ్రికా గణనీయంగా పెద్దదిగా కనిపిస్తుంది. అదే సమయంలో ఐరోపా, ఉత్తర అమెరికా చిన్నవిగా కనిపిస్తాయి.

# ప్రపంచ సుందరిగా జోహీర్రీ మోలా..

**- డొమెనిక్ రిపబ్లిక్ భామను వరించిన కిరీటం**




**న్యూఢిల్లీ సెప్టెంబరు 05 (జర్నలిస్ట్ డైరీ) :** డొమెనికన్ రిపబ్లిక్‌కు చెందిన జోహీర్రీ మోలా ప్రపంచ సుందరి కిరీటాన్ని దక్కించుకున్నారు. వియత్నాంలోని న్హా ట్రాంగ్‌లో శనివారం జరిగిన 73వ ఎడిషన్ మిస్ వరల్డ్ 2026 గ్రాండ్ ఫినాలేలో జోహీర్రీ ప్రథమ స్థానంలో నిలిచి కిరీటాన్ని ఎగరేసుకుపోయారు. 110 దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొన్న ఈ పోటీలో స్పెయిన్ భామ ఎలిజబెత్ రెయిన్స్ మొదటి రన్నరప్‌గా, మలేషియాకు చెందిన తనుసియా శెట్టి రెండో రన్నరప్‌గా నిలిచారు. 2025లో మిస్‌వరల్డ్ కిరీటాన్ని దక్కించుకున్న థాయ్‌లాండ్‌కు చెందిన ఒపల్ సుచతా చువాంగ్ స్రీ.. జోహీర్రీకి మిస్‌వరల్డ్ కిరీటం తొడిగారు. కాగా, ఈ పోటీల్లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన మధ్యప్రదేశ్ ఉజ్జయినీకి చెందిన నటి, మిస్ ఇండియా వరల్డ్ 2024 నికితా పోర్వల్ టాప్-40 ఫైనలిస్ట్‌లలో ఒకరిగా నిలిచారు.

# నేపాల్‌లో విరిగిపడ్డ కొండచరియలు..


**- మళ్లీ వరదలు ముంచెత్తే ప్రమాదం..!**



**న్యూఢిల్లీ సెప్టెంబరు 05 (జర్నలిస్ట్ డైరీ) :** హిమానీనదం విరిగిపడి భారీ వరదల తో అతలాకుతలమైన నేపాల్ ను మరో ముప్పు వెంటాడుతోంది. తాజాగా జారీచేసిన వరద ప్రమాద హెచ్చరికలు ఆ దేశాన్ని తీవ్రంగా భయపెడుతున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో దార్చులా జిల్లాలోని భట్టార్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి చౌలానీ నది ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. కొండలపై నుంచి జారిపడిన రాళ్లు, మట్టితో నదీ ప్రవాహం పాక్షికంగా నిలిచిపోయింది. దాంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాళ్లు తొలగిపోతే ఒక్కసారిగా దిగువ ప్రాంతాలను వరద ముంచెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ క్రమంలోనే నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది. పరిస్థితిని పర్యవేక్షించేందుకు పోలీసులను రంగంలోకి దించింది. సహాయక చర్యల కోసం అత్యవసర ఫోన్ నంబర్లనూ విడుదల చేసింది. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాలు ఇంకా కోలుకోకముందే ఈ కొత్త ముప్పు పొంచి ఉండటం ఆందోళనకరంగా మారింది.

## విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దాడి ఆందోళనకరం

**పోలీసుల వైఖరి మారాలి: జస్టిస్ భుయాన్**



**న్యూఢిల్లీ సెప్టెంబరు 05 (జర్నలిస్ట్ డైరీ) :** జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన ప్రదర్శనలో నిరసనకారులపై పోలీసు సిబ్బంది దాడి చేశారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఐపీఎస్ అధికారులే స్వయంగా నిరసనకారులపై దాడులు చేస్తున్నట్లు కనిపించడం బాధాకరమని ఆయన అన్నారు. పోలీసుల నుంచి ఆశించే నిష్పాక్షికత మాయమవుతున్నట్లు కనపడుతున్నదని అభిప్రాయపడ్డారు. పోలీసులు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. కస్టోడియల్ మరణాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు తీవ్రమైన నేరాలని కూడా ఆయన వ్యాఖ్యానించారు. వీధిలో విధుల్లో ఉన్న పోలీసు అధికారి సామాన్య ప్రజలకు ప్రభుత్వ అధికారానికి ప్రతీక అని చెప్పారు. ఏదైనా సమస్య ఎదురైనపుడు పౌరులు సహాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తారని, కాబట్టి పోలీసులపై నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అత్యవసరమని జస్టిస్ భుయాన్ అన్నారు.

# విదేశీ మహిళతో నగ్నపూజలు..

**న్యూఢిల్లీ సెప్టెంబరు 05 (జర్నలిస్ట్ డైరీ) :** వీడియో కాల్ లో ఓ విదేశీ మహిళ తో నగ్నంగా పూజలు చేయించి, ఆ దృశ్యాలను రికార్డు చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన ఘటన తమిళనాడు రాజధాని చెన్నై లో వెలుగుచూసింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కెనడా కు చెందిన 37 ఏళ్ల మహిళ ఇటీవల తమిళనాడు పర్యటనకు వచ్చారు. ఈ క్రమంలో చెన్నైలోని బెసెంట్ నగర్ బీచ్‌లో ఆమెకు చిలుక జోస్యం చెప్పే ఇసక్కిముత్తు అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఆమె జాతకం చూస్తూనే నిందితుడు.. "మిమ్మల్ని గతంలో టీవీలో చూశాను. నేను చెప్పినట్లు చేస్తే మీరు జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారు" అని నమ్మబలికాడు. అనుకున్నది సాధించాలంటే నగ్నంగా ఒక ప్రత్యేక పూజ నిర్వహించాలని చెప్పాడు. వీడియో కాల్ ద్వారా కూడా ఈ పూజ చేయవచ్చని ఆమెకు



ఆప్షన్ ఇచ్చాడు. అతని మాటలను నమ్మిన బాధితురాలు వీడియో కాల్‌లో నగ్నంగా పూజలో పాల్గొన్నారు. ఈ పూజ నిర్వహించినందుకు ఇసక్కిముత్తు సదరు మహిళ నుంచి రూ.20,000 వసూలు చేశాడు. మరోవైపు ఈ నగ్న పూజ కార్యక్రమాన్ని అంతా తన మొబైల్‌లో రికార్డు చేశాడు. కొద్ది రోజుల తర్వాత ఇసక్కిముత్తు సదరు మహిళకు ఫోన్ చేశాడు. తన వద్ద ఉన్న నగ్న వీడియోను ఆమెకు చూపించాడు. తనకు ఇంకా డబ్బులు కావాలని, ఇవ్వకపోతే నగ్న వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేస్తానని బెదిరించాడు. దాంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు బుధవారం మాంబలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి, నిందితుడు ఇసక్కిముత్తును అరెస్ట్ చేశారు.

# ఇస్రోను ప్రైవేట్‌పరం చేస్తారా?

**-రాతపూర్వక స్పష్టత ఇవ్వాలి**
**-స్పేస్ కమిషన్ చైర్మన్‌కు 9 ఇస్రో ఉద్యోగ సంఘాల లేఖ**




**బెంగళూరు, సెప్టెంబరు 05 (జర్నలిస్ట్ డైరీ) :** బంగారు బాతుల్లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్న కేంద్రంలోని మోదీ సర్కార్.. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కార్యకలాపాలను ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తున్నది. దీనిపై ఇస్రో ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఆరేండ్ల క్రితం ప్రభుత్వం భారత అంతరిక్ష రంగాన్ని ప్రైవేట్ పరిశ్రమలకు అందుబాటులోకి తీసుకురావడం ప్రారంభించినప్పటి నుంచి మొదటిసారిగా అంతరిక్ష శాఖ(డీఓఎస్) పరిధిలోని ఇస్రో కేంద్రాలకు చెందిన వేలాదిమంది సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న 9 ఉద్యోగ సంఘాలు ఈ మార్పు దిశ, ప్రాతిపదికపై అధికారికంగా తమ ఆందోళనను వ్యక్తం చేశాయి. డీవోఎస్ కార్యదర్శిగా, ఇస్రో చైర్మన్‌గా వ్యవహరిస్తున్న స్పేస్ కమిషన్ చైర్మన్ నుంచి ఈ సంఘాలు లిఖితపూర్వక వివరణ కోరాయి. పటిష్టమైన ప్రభుత్వ యాజమాన్యంలోని ఇస్రోతోపాటుగా నిర్దిష్ట వాణిజ్య కార్యకలాపాలలో ప్రైవేట్ భాగస్వామ్యం కొనసాగగలదు. దేశ ప్రయోగ వాహక నౌకల రూపకల్పన, దాని ప్రయోగ మౌలిక సదుపాయాల నిర్వహణ ప్రభుత్వ చేతుల నుంచి జారిపోతుండగా ఇస్రోను కేవలం నామమాత్రపు ఆర్అండ్‌డీ విభాగానికి పరిమితం చేసే విధానాన్ని చర్చ లేకుండా అంగీకరించలేము అని సెప్టెంబర్ 4న రాసిన వినతిపత్రంలో సంఘాలు పేర్కొన్నాయి. ఇస్రో అభివృద్ధి చేసిన సాంకేతికతను జాతీయ ఆస్తిగా అభివర్ణిస్తూ దాని బదిలీ పారదర్శకంగా, జవాబుదారీగా ఉండాలని, అలాగే వ్యూహాత్మక, భద్రత, ఉపాధిపరమైన అంశాలకు అనుగుణంగా ఉండాలని ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. ఉద్యోగులకు సమాచారం తెలుసుకునే, సంప్రదించే , రక్షణ పొందే అర్హత ఉందని, సహజ న్యాయం, సుపరిపాలన ప్రకారం ఇంతటి ప్రాముఖ్యత గల విధానాన్ని సంబంధిత శాఖే స్వయంగా ఉద్యోగులకు వివరించాలని వినతిపత్రం పేర్కొంది.

**తీర్మానం ఉంటే బయటపెట్టాలి**

ఇస్రో భవిష్యత్తులో ఎటువంటి ప్రయోగ వాహనాలను తయారు చేయదని ఇన్-స్పేస్ చైర్మన్ పవన్ గోయెంకా ఇటీవల చేసినట్టుగా చెబుతున్న బహిరంగ ప్రకటనను ప్రస్తావిస్తూ ఆ ప్రకటన భారత ప్రభుత్వం, అంతరిక్ష కమిషన్ లేదా డీవోఎస్ ఆమోదించిన నిర్ణయానికి ప్రతిరూపమా? ఒకవేళ ఆమోదించి ఉంటే ఆ విధానపరమైన నిర్ణయానికి సంబంధించిన తేదీ, అధికారం, పాఠ్యాన్ని దయచేసి తెలియచేయగలరు అని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. పన్ను చెల్లింపుదారుల నిధులు, తరతరాలుగా ఇస్రో ఉద్యోగుల శ్రమతో రూపొందించిన సాంకేతికత, పరీక్షా కేంద్రాలు, ప్రయోగ కేంద్రాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి వాటిని ప్రైవేట్ నిర్వహణకు బదిలీ చేయడం లేదా అందుబాటులో ఉంచడం ఏ సంస్థాగత ఏర్పాట్ల కింద జరుగుతున్నదో, అలాగే అటువంటి బదిలీల్లో ఎన్-స్పేస్‌తో పోలిస్తే ఎన్‌ఎస్‌ఐఎల్ పాత్ర ఏమిటో కూడా లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు కోరాయి. ప్రయోగ వాహనాలు, ఉపగ్రహాల రూపకల్పన నుంచి ఇస్రో క్రమంగా వైదొలగడం వల్ల పరిశోధన అనంతర ప్రయోగాలు దెబ్బతింటాయని, అంతర్గత పనులు తగ్గిపోయి మంజూరైన సిబ్బంది సంఖ్యను స్తంభింపచేయడం లేదా తగ్గించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే సాంకేతిక, శాస్త్రీయ, పరిపాలన, స్టోర్స్, కొనుగోలు, నాణ్యత, భద్రత, పదోన్నతులు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు మూసుకుపోతాయని ఆందోళన చెందుతున్నట్టు ఉద్యోగ సంఘాలు తమ వినతిపత్రంలో పేర్కొన్నాయి

## నది శుభ్రం.. తెచ్చింది ఉద్యోగం..

**-టన్నుల కొద్దీ చెత్తను తీసేసిన బిట్టు తబాహి**
**-నెదర్లాండ్ నుంచి ఉద్యోగ ఆహ్వానం**



**భోపాల్ సెప్టెంబరు 05 (జర్నలిస్ట్ డైరీ) :** ప్రభుత్వాలు చేయలేనిది ఒక కుర్రాడు చేసి చూపించాడు. జనాలు వేస్తున్న చెత్తతో డంపింగ్ యార్డులా మారిపోయిన నదిని ఒక్కడే శుభ్రం చేసి శభాష్ అనిపించాడు. అతనే సురేంద్ర సింగ్ చౌదరి. సోషల్ మీడియాలో బిట్టు తబాహిగా ఫేమస్ అయ్యాడు. తాజాగా అతనికి నెదర్లాండ్స్‌కు చెందిన ఓ పర్యావరణ సంస్థ తమతో కలిసి పనిచేయాలంటూ ఉద్యోగ ఆహ్వానాన్ని పంపిస్తూ పోస్టు చేసింది. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘర్ జిల్లా బయారా గ్రామానికి చెందిన సురేంద్ర స్థానిక గుడికి దగ్గరగా వెళ్లే అజ్నర్ నదిని ప్రజలు చెత్త వేసి డంపింగ్ యార్డులా మార్చేయడాన్ని తట్టుకోలేకపోయాడు. జనవరి 26న నదిని శుభ్రం చేసే పనిని మొదలు పెట్టాడు. ఒక్కడే ప్రతి రోజూ మూడు గంటల పాటు చెత్తను చేతులతోనే ఏరివేయసాగాడు. మధ్యలో కాళ్లు, చేతులకు చర్మ వ్యాధులు వచ్చాయి. చివరికి రూ.30 వేల దాకా ఖర్చు చేసి యంత్రాలతో చెత్తంతా తీసేయించి దేశ వ్యాప్తంగా ప్రశంసలు పొందాడు.

## మృత్యుంజయులు!

**నేపాల్‌లో 11 రోజులు శిథిలాల కింద ఇద్దరు**



**కాఠ్మాండూ: సెప్టెంబరు 05 (జర్నలిస్ట్ డైరీ) :** నేపాల్ వరదల తర్వాత యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్న సహాయక చర్యలు ఇంకా సజీవంగా ఉన్నవారిని రక్షిస్తున్నాయి. శనివారం నువాకోట్ జిల్లాలోని ఓ జల విద్యుత్తు సొరంగంలో లుహైతాయో అనే చైనా కార్మికుడిని, శిథిలమైన ఇంటి నుంచి చంద్రిక శ్రేష(?ట60) అనే మహిళను రెస్క్యూ సిబ్బంది రక్షించారు. మెరుగైన వైద్యం కోసం వారిద్దరిని కాఠ్మాండూకు తరలించారు. చైనా కార్మికుడిని సొరంగంలో 225 మీటర్ల లోపల గుర్తించారు. నాలుగు అంతస్తుల తన ఇంట్లో పై అంతస్తులో చంద్రిక అచేతనంగా పడి ఉండటాన్ని గమనించి ఆమెను కాపాడారు. మరోవైపు ఇప్పటికీ 5300 మంది వరదల్లో గల్లంతైనట్టు అధికారులు ప్రకటించారు. వీరిలో 275 మంది భారతీయులు ఉన్నారు. వరదల వల్ల 32 వేల మందికి పైగా ప్రభావితులయ్యారు.

# పాకిస్తాన్‌కు గూఢచర్యం.. 15 మందిపై ఎన్ఐఏ చార్జిషీట్

**లక్నో: సెప్టెంబరు 05 (జర్నలిస్ట్ డైరీ) :** పాకిస్తాన్‌కు గూఢచర్యం చేసిన కేసులో 15 మంది నిందితులపై ఎన్ఐఏ శనివారం చార్జిషీట్ దాఖలు చేసింది. లక్నోలోని ప్రత్యేక కోర్టులో ఈ చార్జిషీట్‌ను సమర్పించింది. నిందితులు దేశానికి సంబంధించిన కీలక, సున్నితమైన సమాచారంతో పాటు నిషేధిత ప్రాంతాల జీపీఎస్ లొకేషన్లను పాకిస్తాన్‌కు




చేరవేశారని ఎన్ఐఏ ఆరోపించింది. ఇందుకోసం భారతీయ సిమ్ కార్డులను ఉపయోగించినట్లు తెలిపింది. ఈ కేసులో మొత్తం 21 మందిని అరెస్టు చేయగా.. ఐదుగురు మైనర్లకు సంబంధించిన నివేదికను ఇప్పటికే జువైనల్ జస్టిస్ బోర్డుకు సమర్పించారు. మిగతా నిందితులపై దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ వెల్లడించింది.

# బిజినెస్

## భారీగా తగ్గిన టమాటా ధరలు.. రైతులకు తీరని నష్టం

**హైదరాబాద్, సెప్టెంబర్ 5:**



టమాటా ధరలు ఒక్కసారిగా పతనమవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పంటకు కనీస గిట్టుబాటు ధర కూడా లభించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో టమాటాలకు డిమాండ్ ఉన్నప్పటికీ, రైతులకు అందుతున్న ధరలు మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోవడం ఆవేదన కలిగిస్తోంది.రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌లో 25 కిలోల టమాటా బాక్స్ కేవలం రూ.30 నుంచి రూ.55 మధ్య మాత్రమే అమ్ముడవుతోంది. దీంతో రైతులకు కిలో టమాటాపై రూ.2 నుంచి రూ.3 వరకు మాత్రమే ఆదాయం లభిస్తోంది. ఈ ధరలు పంట కోత, రవాణా, కూలీల ఖర్చులకు కూడా సరిపోకపోవడంతో రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో కొందరు రైతులు టమాటా పంటను మార్కెట్‌కు తరలించకుండా పొలాల్లోనే పారబోస్తున్నారు. మరికొందరు కోత ఖర్చులు కూడా రాకపోవడంతో పంటను అలాగే వదిలేస్తున్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు తిరిగి రాకపోవడంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరలను స్థిరీకరించాలని కోరుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. టమాటా నాణ్యతను బట్టి కిలోకు రూ.5 నుంచి రూ.10 వరకు మాత్రమే ధర లభిస్తున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఉత్పత్తి భారీగా పెరగడం, మార్కెట్‌కు అధిక మొత్తంలో సరుకు రావడం వల్ల ధరలు ఒక్కసారిగా క్షీణించినట్లు అధికారులు భావిస్తున్నారు. మరోవైపు వినియోగదారులకు మాత్రం తక్కువ ధరలకు టమాటాలు లభిస్తున్నాయి. రిటైల్ మార్కెట్లలో రూ.100కు 5 నుంచి 7 కిలోల వరకు టమాటాలు విక్రయిస్తున్నారు. రైతుల వద్ద ధరలు కుప్పకూలినా, వినియోగదారుల వరకు చేరే సరికి మధ్యవర్తుల పాత్ర కారణంగా ధరల్లో వ్యత్యాసం కనిపిస్తోందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. టమాటా ధరల పతనంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతుండగా, ప్రభుత్వం మార్కెట్ జోక్యం చేసుకుని కనీస మద్దతు ధర కల్పించడంతో పాటు రైతులకు తక్షణ సహాయం అందించాలని వ్యవసాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం పరిస్థితి ఇలాగే కొనసాగితే టమాటా సాగుపై రైతుల ఆసక్తి తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### భారీగా తగ్గిన బంగారం ధరలు..
## కొనుగోలుదారులకు ఊరట

హైదరాబాద్, సెప్టెంబర్ 5:

ఇటీవల వరుసగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలకు శనివారం బ్రేక్ పడింది. దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా తగ్గడంతో కొనుగోలుదారులకు ఊరట లభించింది. ముఖ్యంగా పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి ఈ తగ్గుదల కొంత ఉపశమనంగా మారింది. బులియన్ మార్కెట్ వివరాల ప్రకారం, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,700 తగ్గి రూ.1,41,900కు చేరుకుంది. అలాగే 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,860 మేర తగ్గి రూ.1,54,800 వద్ద కొనసాగుతోంది. ఒకే రోజులో ఈ స్థాయిలో ధరలు తగ్గడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇక వెండి ధరల్లోనూ స్వల్ప తగ్గుదల నమోదైంది. కిలో వెండి ధర రూ.100 తగ్గి రూ.2,54,900కు చేరుకుంది. బంగారం, వెండి ధరలలో ఈ తగ్గుదల తెలుగు రాష్ట్రాల్లోనూ అమలులో ఉందని వ్యాపార వర్గాలు వెల్లడించాయి.



అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల్లో చోటుచేసుకున్న మార్పులు, డాలర్ విలువలో హెచ్చుతగ్గులు, పెట్టుబడిదారుల ధోరణి వంటి అంశాల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లోనూ ధరలు తగ్గినట్లు నిపుణులు చెబుతున్నారు. గత కొద్ది రోజులుగా పసిడి ధరలు రికార్డు స్థాయిల్లో కొనసాగుతుండగా, తాజా తగ్గుదలతో వినియోగదారులు కొనుగోళ్లపై ఆసక్తి చూపే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అయితే అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, డాలర్ సూచీ, కేంద్ర బ్యాంకుల విధాన నిర్ణయాల ఆధారంగా రానున్న రోజుల్లో బంగారం ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ధరలు తగ్గిన నేపథ్యంలో ఆభరణాల కొనుగోళ్లకు ఇది అనుకూల సమయంగా భావిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

## వాట్సాప్‌లో బిల్ పేమెంట్ సేవలు అందుబాటులోకి

**న్యూఢిల్లీ,**

ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన వినియోగదారుల కోసం మరో కీలక సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై విద్యుత్, గ్యాస్, నీటి బిల్లులతో పాటు ఇన్సూరెన్స్ ప్రీమియంలు, క్రెడిట్ కార్డు బకాయిలు, రుణాల ఈఎంఐలు సహా 30 రకాల బిల్లులను నేరుగా వాట్సాప్ ద్వారానే చెల్లించే అవకాశం కల్పించింది. భారత్ కనెక్ట్ నెట్‌వర్క్‌తో భాగస్వామ్యంగా ఈ సేవలను ప్రారంభించినట్లు సంస్థ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 22,700కు పైగా బిల్లర్లకు సంబంధించిన చెల్లింపులను ఒకే వేదికపై సులభంగా నిర్వహించుకునేలా ఈ ఫీచర్‌ను రూపొందించారు. ఈ కొత్త సదుపాయం ద్వారా వినియోగదారులు గతంలో చేసిన చెల్లింపుల వివరాలను పరిశీలించడమే కాకుండా, రాబోయే బిల్లుల గడువులను కూడా ట్రాక్ చేసుకునే వీలుంటుంది. దీంతో వివిధ యాప్‌లు లేదా వెబ్‌సైట్లను సందర్శించాల్సిన అవసరం లేకుండా,




రోజువారీ ఆర్థిక లావాదేవీలను మరింత సులభంగా నిర్వహించుకోవచ్చని కంపెనీ పేర్కొంది. డిజిటల్ చెల్లింపులను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని మెటా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు కూడా సులభంగా డిజిటల్ పేమెంట్లు చేయగలిగేలా వాట్సాప్‌ను సమగ్ర చెల్లింపు వేదికగా అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలో కోట్లాది మంది వినియోగదారులు ఉపయోగిస్తున్న వాట్సాప్‌లో ఈ సేవలు ప్రారంభం కావడంతో డిజిటల్ చెల్లింపుల వినియోగం మరింత పెరిగే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా బిల్లుల చెల్లింపులు, రుణాల ఈఎంఐలు, ఇన్సూరెన్స్ ప్రీమియంలను ఒకే యాప్‌లో నిర్వహించుకునే అవకాశం వినియోగదారులకు మరింత సౌలభ్యాన్ని కల్పించనుంది.

### ఆగస్టు 15 సీక్రెట్ రివీల్..
## ధోనీ రిటైర్‌మెంట్ రోజే రైనా ఎందుకు గుడ్‌బై చెప్పాడు?

**-ధోనీతో పాటే అంతర్జాతీయ క్రికెట్‌కు రైనా రిటైర్మెంట్**
**-ఆ రోజు ఏం జరిగిందో చెప్పిన సురేశ్ రైనా**
**-నా రిటైర్మెంట్ ప్రకటన విని ధోనీ షాక్ అయ్యాడు: రైనా**

ఆగస్టు 15, 2020.. మహేంద్ర సింగ్ ధోనీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోజు. 2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిన మ్యాచులో రనౌట్ అయిన ధోనీ.. మళ్లీ భారత జెర్సీ ధరించి మైదానంలో కనిపించలేదు. ఆగస్టు 15, 2020 రోజు సాయంత్రం 7.29 గంటలకు రిటైర్మెంట్ ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. అయితే ధోనీ ప్రకటన వచ్చిన కాసేపటికే.. సురేశ్ రైనా కూడా తానూ అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. దీంతో క్రీడా ప్రపంచం నిమిషాల వ్యవధిలో రెండు రిటైర్మెంట్ ప్రకటనలను చూసింది. అయితే ఇదే విషయంపై తాజాగా సురేశ్ రైనా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడాడు. అసలు ఆ రోజు డ్రెస్సింగ్ రూమ్‌లో ఏం జరిగిందో రైనా తాజాగా బయటపెట్టాడు. మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రాతో జరిగిన ప్రత్యేక సంభాషణలో రైనా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు. “దేశం కోసం, ఆట కోసం



ఎంతో చేశాం. కానీ కుటుంబంతో గడపడానికి అదే సరైన సమయమని నాకు అనిపించింది. డ్రెస్సింగ్ రూమ్‌లో ధోనీ తన నిర్ణయాన్ని ప్రకటించిన వెంటనే, నేను కూడా వెళ్లి ‘నా పని కూడా అయిపోయింది’ అని చెప్పాను. అది వినగానే ధోనీ తీవ్ర ఆశ్చర్యానికి గురై ‘యే క్యా కియా తూనే’ (ఇదేం పని చేశావ్) అని షాకయ్యాడు” అని రైనా తెలిపాడు. యూఏఈలో జరిగే ఐపీఎల్ కోసం సీఎస్కే బయో-బబుల్‌లో సిద్ధమవుతున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. నాకోసం తన బ్యాటింగ్ పొజిషన్‌నే త్యాగం చేశాడు: రైనా ఈ సందర్భంగా ధోనీతో ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని రైనా గుర్తుచేసుకున్నారు. “సౌరవ్ గంగూలీ కెప్టెన్‌గా ఉన్నప్పుడు ధోనీ టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసేవాడు. కానీ జట్టు కోసం, నా కోసం తన సొంత బ్యాటింగ్ పొజిషన్‌ను త్యాగం చేశాడు. యువరాజ్ సింగ్‌ను పైన పంపి, నన్ను ఆ తర్వాత ఆడించి, ధోనీ మాత్రం ఆ తర్వాతి స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. నా ప్రతిభపై నాకంటే ఎక్కువగా ధోనీ నమ్మకం ఉంచాడు. ఆ నమ్మకమే నాకు కొండంత బలాన్నిచ్చింది. అందుకే ఫీల్డింగ్, బౌలింగ్ లేదా బ్యాటింగ్ ఏదైనా సరే జట్టు కోసం ప్రాణం పెట్టి ఆడా” అని రైనా వివరించాడు.క్రికెట్ అనేది కేవలం మైండ్ గేమ్ మాత్రమే కాదని, ఒక దశ దాటిన తర్వాత హృదయంతో ఆలోచిస్తామని రైనా అన్నారు. “ధోనీ లాంటి వ్యక్తి మీ కోసం అంత త్యాగం చేసినప్పుడు, తిరిగి అతడికి ఏదో ఒకటి ఇవ్వాలనే తపన ప్రతీ ఒక్కరికీ ఉంటుంది. డబ్బులు ఎవరి దగ్గరైనా ఉండవచ్చు, కానీ దాన్ని ఖర్చు చేయడానికి పెద్ద మనసు ఉండాలి. అలాగే స్నేహానికి కూడా ఒక హృదయం ఉండాలి. మా మధ్య ఉన్న ఆ హృదయపూర్వక స్నేహం ఎప్పటికీ ఇలాగే నిలిచిపోతుంది” అని చిన్న తలా సురేష్ రైనా ఎమోషనల్ అయ్యాడు.

## రియాలిటీ షో హోస్ట్‌గా రోహిత్

**ముంబై:**

భారత స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ తన క్రికెట్ కొనసాగిస్తూనే బుల్లితెరపై హోస్ట్‌గా సరికొత్త ఇన్నింగ్స్ ప్రారంభించాడు. సోనీ టీవీలో ఈ నెల 19 నుంచి ప్రసారం కానున్న ‘ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్’ అనే గేమ్ షో ద్వారా రోహిత్ టీవీ ఎంట్రీ ఇస్తున్నాడు. ఇటీవల విడుదలైన ఈ షో ప్రోమోలో హిట్‌మ్యాన్ తన కామెడీ టైమింగ్, పంచ్ డైలాగ్స్‌తో ఆకట్టుకుంటున్నాడు. ఈ ప్రోమోలో ‘గార్డెన్ సే రిపోర్టింగ్ లైవ్, జెర్సీ నంబర్ 45’ అని రోహిత్ చెప్పిన సంభాషణ అభిమానులను విపరీతంగా అలరిస్తోంది.2024లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్ సమయంలో మైదానంలో తోటి ఫీల్డర్లను ఉద్దేశించి ‘ఎవరూ గార్డెన్‌లో తిరగకూడదు’ అంటూ రోహిత్ చేసిన సరదా వ్యాఖ్య అప్పట్లో సంచలనం సృష్టించింది. అదే డైలాగ్‌ను ఇప్పుడు తన టీవీ షో ఎంట్రీకి రీ-క్రియేట్ చేయడంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఈ షో సెట్‌లో నటుడు రాకేష్ బేడీతో ముచ్చటిస్తూ.. ‘నాకు వేగంగా బౌలింగ్ వేసే వాళ్లంటే



ఇష్టం.. కొందరు బౌలర్లను ఒకే చోట కొట్టడం ఇంకా ఇష్టం’ అని రోహిత్ వేసిన పంచ్‌లు షోపై అంచనాలను పెంచేశాయి. భారత్ తరఫున ప్రస్తుతం రోహిత్ వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. కాగా,2027 వన్డే ప్రపంచకప్‌లో హిట్‌మ్యాన్ స్థానంపై వస్తున్న ఊహాగానాలకు బీసీసీఐ చెక్ ఇటీవలే పెట్టింది.

# స్పోర్ట్స్

## ఫైనల్లో సాత్విక్-చిరాగ్




షెన్‌జెన్ (చైనా)

భారత డబుల్స్ స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నమెంట్‌లో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచారు. మెగా టోర్నీలో అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తూ ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో నాలుగో సీడ్ సాత్విక్-చిరాగ్ ద్వయం 21-16, 18-21, 21-11తో మలేషియాకు చెందిన నూర్ అయుబ్ -- తాన్ వీ కియోంగ్ జంటను ఓడించింది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జంట అద్భుతమైన వ్యూహాత్మక ఆటతీరుతో అలరించింది.ఈ విజయంతో సాత్విక్-చిరాగ్ గత నాలుగేండ్లలో మూడోసారి (2023, 25, 26) ఈ టోర్నీ ఫైనల్‌కు చేరింది. సెమీస్ తొలి గేమ్‌ను 0-5తో ఆరంభించిన భారత జోడీ వెంటనే తేరుకుంది. ఏకాగ్రత కోల్పోకుండా వరుసగా ఏడు పాయింట్లు సాధించి 7-5తో ఆధిక్యంలోకి వచ్చిన సాత్విక్-చిరాగ్ తర్వాత ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా తొలి గేమ్‌ను సులువుగా ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్ కోల్పోయినా నిర్ణయాత్మక మూడో గేమ్‌లో భారత షట్లర్లు బలమైన స్మాష్‌లతో పాటు నెట్ గేమ్‌లో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించారు. ఆదివారం జరిగే ఫైనల్లో భారత జోడీ చైనాకు చెందిన హే జి టింగ్-రెన్ జియాంగ్ యు ద్వయంతో పోటీ పడనుంది.

# సరికొత్త కాన్సెప్ట్‌తో లీసా



అనన్య నాగళ్ల ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'లీసా'. జవహర్ పవార్ దర్శకుడు. వెంకట్ దుగ్గిరెడ్డి, ఐల రామకృష్ణ నిర్మాతలు. ఈ సినిమా షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసి నవంబర్‌లో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక,నిర్మాతలు మాట్లాడుతూ 'సినిమా చాలా బాగా వచ్చింది. భారతీయ తెరపై ఇప్పటివరకూ రాని కొత్త కాన్సెప్ట్‌తో 'లీసా' తెరకెక్కుతున్నది.రెండు భిన్నమైన జోనర్లను మేళవించి, సరికొత్త పద్ధతిలో ఈ సినిమా రూపొందించాం. ఈ కథ నచ్చి అగ్ర సంగీత దర్శకుడు మణిశర్మ సంగీతం అందించేందుకు సిద్ధమయ్యారు. సినిమా మేకింగ్, అనన్య నాగళ్ల నటన ఈ సినిమా ప్రధాన బలాలు' అని తెలిపారు. అల్లాల రవిరెడ్డి, సుమన్, మూసా అలీ ఖాన్, రత్నాకర్‌రెడ్డి, జబర్దస్త్ సత్యశ్రీ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాత, కథనం, ఛాయాగ్రహణం: సతీష్‌రెడ్డి మాసం, సమర్పణ: అయాన్ష్‌రెడ్డి మాసం, నిర్మాణం: ఓంసాయిరామ్ ఆర్ట్స్, ఐరాస్ ఎంటర్‌టైన్మెంట్స్.

# బాక్సాఫీస్ వద్ద 'మీర్జాపూర్' సంచలనం..

## తొలి రోజే రూ.24 కోట్లు!




వెబ్ సిరీస్‌గా ప్రపంచవ్యాప్తంగా అపారమైన క్రేజ్ సంపాదించుకున్న 'మీర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై కూడా అదే జోరును ప్రదర్శిస్తోంది. పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, రవి కిషన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మీర్జాపూర్: ది మూవి' సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘనమైన ఓపెనింగ్స్ రాబట్టింది.ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం.. ఈ చిత్రం తొలి రోజు భారతదేశంలో సుమారు రూ. 24.75 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. ఇందులో హిందీ వెర్షన్ ద్వారా రూ. 24.60 కోట్లు రాగా, తెలుగు వెర్షన్ ద్వారా దాదాపు రూ. 15 లక్షలు వచ్చాయి. ఇక ఈ సినిమా తొలి రోజు గ్రాస్ వసూళ్లు రూ. 29.70 కోట్లను దాటాయి. ఈ బలమైన ఓపెనింగ్‌తో 'మీర్జాపూర్: ది మూవి' 2026 సంవత్సరంలో అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రాల జాబితాలో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. గత నెలలో వచ్చిన ఇమ్రాన్ హష్మీ 'ఆవారాపన్ 2' సినిమా తొలి రోజు రూ. 22 కోట్ల నెట్ వసూళ్లను సాధించగా, మీర్జాపూర్ ఆ రికార్డును వెనక్కి నెట్టింది. అయితే, రూ. 30 కోట్ల ఓపెనింగ్‌తో మూడో స్థానంలో ఉన్న 'బోర్డర్ 2' చిత్రానికి ఇది స్వల్ప దూరంలో నిలిచింది. ఇక 'టాక్సిక్', 'ధురంధర్ ది రివెంజ్' సినిమాలు వరుసగా రూ. 55 కోట్లు, రూ. 99 కోట్ల తొలి రోజు వసూళ్లతో మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

# మోహన్‌లాల్ కొత్త సినిమా 'ఆపరేషన్ గంగా'..

## - వార్ బ్యాక్‌డ్రాప్‌లో అదిరిపోయే ఫస్ట్ లుక్!




మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ తన కొత్త సినిమాను అధికారికంగా ప్రకటించారు. 'హ367' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'ఆపరేషన్ గంగా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ మేరకు చిత్ర యూనిట్ విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను బట్టి ఈ సినిమా పూర్తిగా వార్ (యుద్ధం) బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను యువ దర్శకుడు విష్ణు మోహన్ తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాత గోకులం గోపాలన్ శ్రీ గోకులం మూవీస్ పతాకంపై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మోహన్ లాల్‌తో పాటు అర్జున్ రాంపాల్, పార్తిబన్, ఆదిల్ హుస్సేన్, భాగ్యశ్రీ బోస్ వంటి భారీ తారగణం నటించబోతుంది.కాగా.. ఈ చిత్రానికి టెక్నికల్ నిపుణులుగా గ్లోబల్ లెవెల్ టెక్నీషియన్స్ పనిచేస్తుండటం విశేషం. ప్రపంచస్థాయి యాక్షన్ మరియు విజువల్స్ అందించేందుకు మేకర్స్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన 'పుష్ప' చిత్రానికి పనిచేసిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మిరోస్లావ్ కుబా బ్రోజెర్ ఈ సినిమాకు కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. శాశ్వత్ సచ్‌దేవ్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. 'కిల్', 'వార్' వంటి బాలీవుడ్, గ్లోబల్ యాక్షన్ చిత్రాలకు పనిచేసిన ప్రముఖ స్టంట్ డైరెక్టర్ ఓ సే-యెంగ్ ఈ సినిమాలోని భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను డిజైన్ చేయబోతున్నాడు.


# ఎల్లమ్మలో కథానాయికగా?

బలగం' దర్శకుడు వేణు యెల్దండి తన ద్వితీయ ప్రయత్నంగా చేస్తున్న సినిమా 'ఎల్లమ్మ'. దిల్‌రాజు నిర్మిస్తున్న ఈచిత్రం ద్వారా సంగీత సంచలనం దేవిశ్రీప్రసాద్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. మరి 'ఎల్లమ్మ'లో కథానాయిక ఎవరు? ఈ ప్రశ్న గత కొంతకాలంగా ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తూనే ఉన్నది. ఈ క్రమంలో చాలామంది కథానాయికల పేర్లు కూడా వినిపించాయి. సాయిపల్లవి నుంచి మొదలై కీర్తిసురేశ్, రష్మిక మందన్నా, కృతి శెట్టి.. ఇలా చెప్పుకుంటూపోతే పెద్ద లిస్టే ఉన్నది. ఇప్పుడు తాజాగా 'రొమాంచకం' బ్యూటీ అనంతిక సనిల్‌కుమార్ పేరు వినిపిస్తున్నది. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం అనంతిక ఈ సినిమాకు కథానాయికగా దాదాపుగా ఖరారైనట్టు వినికిడి.ఇటీవలే దేవిశ్రీప్రసాద్, అనంతికలపై మేకర్స్ ఓ ఫొటోషూట్‌ని కూడా నిర్వహించినట్టు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది. ఇక 'ఎల్లమ్మ' కథ విషయానికొస్తే.. ఇది ఓ గ్రామదేవత నేపథ్యంలో సాగే కథ. రంగస్థల కళాకారుడైన 'పర్షి'కి ఎల్లమ్మగా మారాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? అసలు ఈ ఎల్లమ్మ ఎవరు? ఎల్లమ్మతల్లికి పర్షి కుటుంబానికీ ఉన్న సంబంధం ఏంటి? అనే ఆసక్తికరమైన ప్రశ్నల నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. 'బలగం' మాదిరిగానే తెలంగాణ నేపథ్య కథాంశంతో ఈ సినిమా సాగుతుంది.



# ఇండస్ట్రీ మారాలంటే ప్రేక్షకులు మారాలి..

## -'పెద్ది' వివాదంపై తాప్సీ కామెంట్స్!



భారతీయ సినిమాలలో మహిళలను వస్తువులుగా చూపించడంపై నటి తాప్సీ పన్ను కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం దర్శక-నిర్మాతలు మాత్రమే కాకుండా, ప్రేక్షకులు కూడా ఈ ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. 'పెద్ది', 'టాక్సిక్' వంటి చిత్రాలపై వస్తున్న విమర్శల నేపథ్యంలో తాప్సీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ఒక ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ.. ప్రేక్షకులు కోరుకుంటున్నదే మేము ఇస్తున్నాము అనే వాదనను చిత్ర పరిశ్రమ తరచుగా తెరపైకి తెస్తుందని చెప్పారు. జనాలు ఏది కోరుకుంటే అది ఇవ్వకపోతే డబ్బులు ఎలా వస్తాయని మేకర్స్ భావిస్తారని, ఈ ఆలోచనా విధానం వల్ల అసలు కళ, నైపుణ్యం వెనుకబడిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నటులు, దర్శకులు మాత్రమే ఈ సమస్యను పరిష్కరించలేరని, సోషల్ మీడియాలో ప్రేక్షకులు వ్యవహరించే తీరు ఈ సంస్కృతి కొనసాగడానికి కారణమవుతోందని ఆమె విమర్శించారు. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, కొందరు మాత్రం ఆ చిత్రాలలోని ఫోటోలను జూమ్ చేయడం, వీడియోలలో విచిత్రమైన కోణాలను ఉపయోగించి వైరల్ చేయడం వంటి పనులకు పాల్పడుతున్నారని తాప్సీ గుర్తుచేశారు. దీనివల్ల సోషల్ మీడియాలో అలాంటి కంటెంట్‌కు ఆదరణ ఉందని మేకర్స్‌కు సంకేతాలు వెళ్తున్నాయని చెప్పారు. కోవిడ్ మహమ్మారికి ముందు భారతీయ సినిమా మంచి పురోగతిని సాధించి ప్రపంచ స్థాయి చిత్రాలతో పోటీ పడిందని, అయితే ఇప్పుడు మళ్లీ పరిశ్రమ వెనకడుగు వేస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ విషయమై చిత్రనిర్మాతలు చివరికి బాధ్యతంతా ప్రేక్షకులపైనే నెట్టేస్తారని, ఆ సమయంలో నటుల దగ్గర ఎలాంటి సమాధానం ఉండదని తాప్సీ వాపోయారు. ఈ పోరాటంలో నటులు ఒంటరివారైపోతారని, కేవలం ప్రేక్షకులు మాత్రమే తమకు సహాయం చేసి ఈ యుద్ధంలో గెలిపించగలరని ఆమె పేర్కొన్నారు. కాగా, రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' చిత్రంలో జాన్వీ కపూర్ పాత్రపై వచ్చిన విమర్శలు, యష్ చిత్రం 'టాక్సిక్' లో మహిళల చిత్రీకరణపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరిగిన తరుణంలో తాప్సీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పెద్ది చిత్రంలో జాన్వీని చూపించిన విధానంపై విమర్శలు రావడంతో ఆ సన్నివేశాలను తొలగించి దర్శకుడు బుచ్చి బాబు క్షమాపణలు కోరిన విషయం తెలిసిందే.

# డ్రాగన్ డేట్ మారదు



'డ్రాగన్' షూటింగ్‌లో ఎన్టీఆర్ భుజానికి గాయమైన విషయం తెలిసిందే. ఆగస్ట్‌లో ఆయనకు సర్జరీ కూడా జరిగింది. ప్రస్తుతం తారక్ రెస్ట్ మోడ్‌లో ఉన్నారు. దాంతో 'డ్రాగన్' సినిమా అనుకున్న డేట్‌కి విడుదల కావడం కష్టమే అంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్టు ఇప్పటికే నిర్మాతలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో వస్తున్న విమర్శలపై నిర్మాతల్లో ఒకరైన స్పందించారు. 'డ్రాగన్'ని అనుకున్న డేట్‌లోనే కచ్చితంగా విడుదల చేస్తామని, మరో రెండు వారాల్లో షూటింగ్ మొదలవుతుందని, ఫిబ్రవరి కల్లా షూటింగ్ మొత్తం పూర్తిచేస్తామని రవిశంకర్ తెలిపారు. ఇందులో ఎన్టీఆర్ 'లూగర్' అనే ఉద్వేగపూరితమైన పాత్రలో కనిపించనున్నారు. ప్రశాంత్ నీల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈచిత్రంలో రుక్మిణీ వసంత్, అనిల్‌కపూర్, బిజు మీనన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465